**నమ్మలేని నిజాలు**

గాలి బుడగ
నీటి బుబు బుడగ
శూన్యజీవితం.

ఎద్దు మనిషి
జల్లికట్టు పోటీలు
పశువే నయం.

విమర్శ ఘాటు
నిజాల ముంతపొగ
దొంగదొరకు.

భోగి భాగ్యాలు
ఆచారాల రివాజు
సంక్రాంతి క్రాంతి.

ఏకాంత వృక్షం
సవాలక్ష కష్టాలు
మనిషి లాగ.



– రేడియమ్
సెల్: 9291527757

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

**శ్రీనిజాలు**

కాళేశ్వరం అదృష్టం
మీ నోరూ మీ కష్టం !
కాళేశ్వరం అరిష్టం
మా నోరూ మా ఇష్టం !
నిన్నటిది రాజకీయం
కాళేశ్వరం కూలింది !
ఆ నీటిని వాడుతాము
అసలు విషయం తేలింది !



– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

హైదరాబాద్ గురువారం 26-2-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:164 పేజీలు:6 వెల: రూ.1/-

## పాఠ్యాంశం తొలగిస్తాం.. సుప్రీం సీరియస్‌పై కేంద్రం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి పాఠ్యాంశంలో 'న్యాయవవస్థలో అవినీతి' అంశాన్ని ప్రవేశపెట్టడంపై సుప్రీంకోర్టు సీరియస్ కావడంతో కేంద్రం వెంటనే స్పందించింది. పాఠ్యాంశంలోని భాగాలను తొలగించేందుకు నిర్ణయించింది. పాఠ్యాంశంలో ఆవిధంగా వచ్చి ఉండాల్సింది కాదని, దీనికి బదులు స్ఫూర్తిదాయకమైన విషయాలను రాసి ఉండాల్సిందని కేంద్రం అభిప్రాయపడినట్టు ఉన్నత స్థాయి వర్గాలు తెలిపాయి.

ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి పాఠ్యాశంలో న్యాయవ్యవస్థలో అవినీతి అంశాన్ని ప్రవేశపెట్టడంపై సుప్రీంకోర్టు బుధవారంనాడు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వ్యవహారం న్యాయవాదులు, న్యాయమూర్తులందరినీ కలవరానికి గురి చేసిందని, న్యాయవ్యవస్థ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తే ఊరుకునేది లేదని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని సీజేఐ సూర్యకాంత్ పేర్కొన్నారు. 'కొన్ని రోజులు ఆగండి. దీనిపై నేను సుమోటోగా విచారణ చేపడతాను' అని తెలిపారు. న్యాయవ్యవస్థలో అవినీతి గురించి 8వ తరగతి విద్యార్థులకు ఎన్‌సీఈఆర్‌టీ బోధిస్తోందని సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ సుప్రీంకోర్టు దృష్టికి తెచ్చారు. మంత్రులు, ఎమ్మెల్యేలు సహా రాజకీయ నేతలు పెద్దఎత్తున అవినీతికి పాల్పడుతుంటే ప్రభుత్వాలు ఎందుకు దాచిపెడుతున్నాయని ప్రశ్నించారు. ఎంపిక చేసి మరీ న్యాయవ్యవస్థనే నిలదీస్తున్నట్టు కనిపిస్తోందని సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి సైతం అభ్యంతరం వ్యక్తం చేశారు.

ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యాంశంలో..

ఎన్‌సీఈఆర్‌టీ ఇటీవల న్యాయవ్యవస్థ అనే అధ్యాయాన్ని విస్తరించింది. న్యాయవ్యవస్థలో ఉన్న అవినీతి అంశాన్ని తొలిసారిగా ప్రవేశపెట్టింది. విద్యార్థులు కేవలం సిద్ధాంత పరమైన అవగాహనకే పరిమితం కారాదని, వ్యవస్థలోని సవాళ్లు, లోపాలు, వాస్తవ పరిస్థితుల గురించి కూడా తెలుసుకోవాలనే లక్ష్యంతో ఈ మార్పులు చేసినట్టు చెబుతోంది. లక్షలాది కేసులు, విచారణలో జరుగుతున్న జాప్యం వంటి అంశాలను పాఠ్యాంశంలో ప్రస్తావించింది. అయితే పాఠ్యాంశంలో తాజా మార్పుల వల్ల చిన్నారులలో న్యాయవ్యవస్థపై ప్రతికూల భావన పెరగవచ్చనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## ఇంటర్ పరీక్షలు ప్రారంభం..

హైదరాబాద్, ఫిబ్రవరి 25: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. బుధవారం ఉదయం 9:00 గంటలకు పరీక్షలు మొదలయ్యాయి. రెండో సంవత్సరం పరీక్షలు రేపటి నుంచి అంటే.. గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. 33 జిల్లాల్లో విద్యార్థుల కోసం మొత్తం 1,495 పరీక్ష కేంద్రాలను తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా మె?దటి, రెండో సంవత్సరం కలిపి మొత్తం 9,97,075 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయనున్నారు.

ఇంటర్ మె?దటి సంవత్సరం పరీక్షకు 4,89,126 మంది విద్యార్థులు హాజరయ్యారు. రెండో ఏడాది పరీక్షకు 5,07,949 మంది హాజరు కానున్నారు. ఈ పరీక్షలు మార్చి 18వ తేదీ వరకూ జరగనున్నాయి. ఇక పరీక్షకు 5 నిమిషాలు ఆలస్యమైన అనుమతిస్తామని ఇప్పటికే ఇంటర్ బోర్డు ప్రకటించిన విషయం విదితమే. ఈ పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. పరీక్ష కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు, గోడ గడియారాలను ఏర్పాటు చేశారు అధికారులు.

పరీక్ష కేంద్రాల వద్ద నిబంధనలు..

హాల్ టికెట్: పరీక్షా కేంద్రానికి వెళ్లేటప్పుడు హాల్ టికెట్ కాపీని తీసుకెళ్లడం తప్పనిసరి. ఇది లేనిదే ప్రవేశం ఉండదు.

ఎలక్ట్రానిక్ పరికరాలు లేదా గ్యాడ్జెట్లను పరీక్షా కేంద్రం లోపలికి అనుమతించరు.

## భార్య, ముగ్గురు పిల్లల గొంతు కోసి చంపిన ఉన్మాది

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: దేశ రాజధానిలో సభ్య సమాజం తలదించుకునేలా ఒక కిరాతక ఘటన వెలుగుచూసింది. ఢిల్లీలోని చందన్ పార్క్ ఏరియాలో ఒక వ్యక్తి తన కన్నబిడ్డలపై, భార్యపై కనికరం లేకుండా కత్తితో దాడి చేసి ప్రాణాలు తీశాడు.

పోలీసుల సమాచారం ప్రకారం.. ముంచన్ కెవాత్ అనే వ్యక్తి తన భార్యతో పాటు ముగ్గురు కుమార్తెలను అత్యంత దారుణంగా గొంతు కోసి హత్య చేశాడు. ఇవాళ (బుధవారం) ఉదయం వీరి మృతదేహాలను పోలీసులు ఇంట్లో గుర్తించారు. మృతులంతా రక్తపు మడుగులో పడి ఉండటం చూసి స్థానికులు దిగ్భ్రాంతికి గురయ్యారు.

పోలీసుల దర్యాప్తు..

మృతుల్లో.. ముంచన్ కెవాత్ భార్య, అతని ముగ్గురు చిన్నారి కుమార్తెలు ఉన్నారు. నిందితుడు పదునైన ఆయుధంతో అందరి గొంతు కోసి చంపినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘాతుకానికి ఒడిగట్టిన ముంచన్ కెవాత్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు.

కుటుంబకలహాలే ఈ హత్యలకు కారణమా లేక మరేదైనా కారణమా.. అని పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయా.. అనే కోణంలోనూ విచారణ చేస్తున్నారు. నిందితుడి కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు ఉన్నతాధికారులు తెలిపారు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది.

## సీఎం రేవంత్ రెడ్డితో శంతను నారాయణ్ భేటీ



హైదరాబాద్, ఫిబ్రవరి 25: అడోబ్ సీఈవో, తెలంగాణ రైజింగ్-2047 విజన్ బోర్డు సభ్యులు శంతను నారాయణ్ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. బుధవారం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో రేవంత్ రెడ్డితో శంతను నారాయణ్ సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా గ్లోబల్ ట్రెండ్స్.. అవకాశాలపై ప్రభుత్వ పరంగా చేపట్టాల్సిన చర్యల గురించి సీఎంతో శంతన్ నారాయణ్ చర్చించారు. అలాగే గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్, గ్రీన్ ఎనర్జీ, ఉద్యోగాలపై ఏఐ ప్రభావం, స్కిల్లింగ్ అండ్ రీ స్కిల్లింగ్‌కు సంబంధించిన అంశాలపై వీరిరువురు చర్చించారు.

తెలంగాణను మాన్యుఫ్యాక్చరింగ్ పవర్‌గా తీర్చిదిద్దాలని, అందుకు కొన్ని ముఖ్యమైన సంస్థలను ఆకర్షించేలా ప్రణాళికలు రూపొందిచాల్సిన అవసరం ఉందని ఈ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఎకానమీపై ఏఐ రెవల్యూషన్ ప్రభావం, రాబోయే రోజుల్లో ఏఐని సమర్థవంతంగా వినియోగించుకునే అంశాలపై శంతను నారాయణ్‌తో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు నడిపించేందుకు మరింత సహకరించాలని ఈ సందర్భంగా శంతను నారాయణ్‌ను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు.

## ముంబైలో పెరుగుతున్న వాయు కాలుష్యం.. దిగజారిన గాలి నాణ్యత

ముంబై, ఫిబ్రవరి 25: దేశ రాజధాని ఢిల్లీతో పోటీపడుతూ వాణిజ్య రాజధాని ముంబైలో కూడా వాయుకాలుష్యం పెరిగిపోతోంది. రోజూ గాలి నాణ్యత పడిపోతోంది. ఈ విషయాన్ని తాజా ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) నివేదిక తేల్చింది. ఇటీవల ఏక్యూఐ ఏకంగా కొన్నిచోట్ల 300 పాయింట్లు దాటింది. సాధారణంగా 50 లోపు ఉంటే ఆరోగ్యం. 51-100 వరకు ఉంటే ఫర్వాలేదు. కానీ, 100 దాటితే ఆందోళనకరం. అలాంటిది ముంబైలో ఏక్యూఐ వారం రోజులుగా 100 పైనే నమోదవుతోంది.

ఈ నెల 17న 123, 18న 78, 19న 153, 20న 318, 21న 259, 22న 240, 23న 190, 24న 250 పాయింట్లుగా నమోదైంది. ఈ తరహాలో వాయు కాలుష్యం శీతాకాలంలో, ఢిల్లీలో నమోదవుతుంటుంది. అయితే, ఇప్పుడు ఇది ముంబైలోనూ మొదలవ్వడం ఆందోళనకరం. సాధారణంగా ముంబైలో చేపల వాసన, సముద్ర నీటి నుంచి వచ్చే ఉప్పు గాలి వంటివి ఇబ్బంది పెడుతుంటాయి. కానీ, ఇప్పుడు అక్కడి ప్రజలు వాయు కాలుష్యంతో ఇబ్బంది పడుతున్నారు. దీనికి చుట్టుపక్కల ప్రాంతాల్లో రైతులు పంట వ్యర్థాలను తగలబెట్టడం, సిటీలో చెత్తను తగలబెట్టడం ప్రధాన కారణాలుగా నిపుణులు పేర్కొంటున్నారు. అలాగే నిర్మాణ రంగం నుంచి వచ్చే సన్నని ఇసుక, రోడ్లపై నుంచి లేచే మట్టి వంటివి కూడా వాయుకాలుష్యానికి కారణాలు. ముంబైలో బిల్డింగుల కూల్చివేతలు, కొత్తవి నిర్మించడాలు నిత్యం జరుగుతూనే ఉంటాయి. వీటికి సంబంధించి సిమెంట్, ఇసుక వంటి వ్యర్థాలు గాలిలో ఎక్కువగా కలిసిపోతున్నాయి.

పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యం, వాహనాల కాలుష్యం వంటివి కూడా ముంబైలో గాలి నాణ్యత తగ్గడానికి కారణాలు. ఇక ముంబైలో కాలుష్యం పెరగడంపై బాంబే హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. స్థానిక బీఎంసీ, ఎన్‌ఎంఎంసీ అధికారులకు కీలక హెచ్చరికలు జారీ చేసింది. కాలుష్యాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలని సూచించింది. ఈ విషయంలో విఫలమైతే బీఎంసీ, ఎన్‌ఎంఎంసీ కమిషనర్లకు వేతనాలు ఆపాలని కూడా సూచించింది. వాయు కాలుష్యం ఇంతలా పెరిగిపోతున్నా అరికట్టడంలో విఫలమవుతున్న స్థానిక నాయకత్వం, ప్రభుత్వంపై అక్కడి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## అకాడమీ చైర్మన్‌గా మరో రెండేళ్ళు పొడిగింపు



తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా ఐజేయు జాతీయ అధ్యక్షులు కె. శ్రీనివాస్ రెడ్డి గారికి మరో రెండేళ్ల పదవీకాలం పొడిగించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

## బాసర ట్రిబుల్‌ఐటీలో ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య!

ఆదిలాబాద్ ఫిబ్రవరి 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : బాసర ట్రిపుల్ ఐటీలో విషాదకర ఘటన చోటు చేసుకుంది. ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్న వసంత అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నట్లు నివేదించబడింది. రేవంత్ రెడ్డి పాలనలో విద్యాలయాలు మృత్యుకూపాలుగా మారుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఏదో ఒక చోట విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడుతున్నారు. మృతురాలిది స్వస్థలం వనపర్తి జిల్లాగా గుర్తించారు. అధికారులు మృతదేహాన్ని గుట్టు చప్పుడు కాకుండా భైంసా ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. ఈ సంఘటన విద్యార్థి సంఘాలతో పాటు, తల్లిదండ్రులలో తీవ్ర ఆందోళనను రేకెత్తించింది. పూర్తి నివేదిక మరియు అధికారిక ప్రకటనల కోసం టీవీ9 కథనాన్ని వీక్షించాల్సిందిగా కోరడమైనది. ఈ దుర్ఘటన బాసర క్యాంపస్‌లో భద్రత మరియు విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. విద్యార్థుల భద్రత, శ్రేయస్సు పట్ల కళాశాల యాజమాన్యం సరైన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

వసంత ఆత్మహత్యకు ప్రేమ విఫలం కావడం కారణమని వైరల్ అవుతోంది. ఆమె గణేష్ అనే యువకుడ్ని ప్రేమిస్తోందని, ఆ యువకుడు తన స్వగ్రామంలో ఆత్మహత్య చేసుకున్నాడని సమాచారం. అ

ంతకుముందు తన ఫోన్, వాట్సాప్ లో వసంత నెంబర్ బ్లాక్ చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో వసంత సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకుందని ట్రిపుల్ ఐటీ విద్యార్థులు చెబుతున్నారు. అయితే పోలీసుల దర్యాప్తులో అసలు విషయాలు బయటకు రానున్నాయి.

## అదుపుతప్పి పొలాల్లో పడిన స్కూల్ వాహనం.. నలుగురు విద్యార్థులకు గాయాలు

కరీంనగర్, ఫిబ్రవరి 25: జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల కేంద్రం శివారులో ఓ స్కూల్ వాహనం బోల్తాపడింది. ఈ ప్రమాదంలో నలుగురు విద్యార్థులకు గాయాలయ్యాయి. బోల్తాపడిన వాహనం మండల కేంద్రంలోని వికాస్ మోడల్ స్కూల్‌కు చెందినదని స్థానికులు తెలిపారు. వికాస్ మోడల్ స్కూల్‌కు చెందిన టాటా ఏసీ వాహనం ఇవాళ ఉదయం విద్యార్థులను పాఠశాలకు తీసుకువస్తుండగా అదుపుతప్పి బోల్తా పడింది. రోడ్డుపక్కనున్న పంటపొలాల్లో దూసుకెళ్లి పడిపోవడంతో అందులో ఉన్న నలుగురు విద్యార్థులు గాయపడ్డారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఖమ్మం ఫిబ్రవరి 25 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలోని గంగారం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. టేకులపల్లి మండలంలోని లచ్చగూడెం గ్రామానికి చెందిన కోర్స రాంబాబు (30) లచ్చగూడెం నుండి బైక్‌పై ఆళ్లపల్లి వెళ్తుండగా గంగారం సమీపంలో ఎదురుగా వస్తున్న ఐస్ క్రీమ్ బండి ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. బోడు పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రాంబాబుకు భార్య కళ్యాణి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

## కుమ్మెర బాధితులకు సంఘీభావంగా దీక్షలో కూర్చున్న కేటీఆర్

మహబూబ్‌నగర్ ఫిబ్రవరి 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లన్న జాతరలో జరిగిన దాడిలో మరణించిన రెండు నెలల పసిపాప కుటుంబాన్ని పరామర్శించేందుకు బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లాలో పర్యటించారు. మల్లన్న జాతరలో కాంగ్రెస్ నాయకులు కుల వివక్ష చూపుతూ చాకలి చంద్రకళ కుటుంబంపై అమానుషంగా దాడికి దిగడంతో ,రెండు నెలల పాప తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. బాధితులకు న్యాయం చేయాల్సిన పోలీసులే దాడికి గురైన బాధిత కుటుంబంపైనే కేసు నమోదు చేయడంతో వారంతా భయపడి గ్రామం వదిలి నాగర్‌కర్నూల్‌లో తలదాచుకుంటున్నారు. ఈ ఘటనలో బాధితులకు న్యాయం జరగకపోగా వేధింపులు ఎక్కువయ్యాయి.

## కన్నీళ్ల స్వీకారం

నా నవ్వుల్లో ఎవరో తప్పిపోయారు
జ్ఞాపకం పేజీలన్నీ వెతుకుతున్నాను
గుర్తుకొచ్చి వెళ్లి ఆలింగనం చేసుకున్నాను
చిరిగిన చొక్కాతో స్నేహితుడి కన్నీళ్లు
వాటిని నా కనురెప్పలు ఎప్పటికీ మోస్తూ



–డా. కె.జి. వేణు
98480 70084

## రాధశ్రీ రాగాలు

వనిత కిన్నెరసాని
వన్నె లెన్నిన వాని
దీవించినది వాణి
అనును రాధశ్రీ !!
మంచి కవితలు వ్రాయి
మదిన గలుగును హాయి
వచ్చు కలికి తురాయి
అనును రాధశ్రీ !!



–రాధశ్రీ
సెల్:9494481210

## చురక

కాళేశ్వరం బాగుచేయ
కడకు ప్రభుత చిత్తశుద్ధి
పూర్తిచేస్తే రైతులకు
పంటనీరు సంవృద్ధి.
గత పాలన తప్పులతో
కుంగినట్టి నిర్మాణం
ఐనా గొప్ప చాటుకొనుడు
ఆ నేతలకవమానం



–వేల్పుల నారాయణ
9440433475

## హిందూ బంధువు, జాతీయతావాది - వీర సావర్కర్

హిందుత్వవాది, హిందూ బంధువు, ధైర్యవంతుడు, దేశభక్తుడు, కవి, రచయిత, న్యాయవాది, రాజకీయవేత్త, జాతీయతావాది అయిన "వీర్ సావర్కర్" అసలు పేరు "వినాయక్ దామోదర్ సావర్కర్". ఆయన వ్యక్తిత్వం తెలిసిన మిత్రులు ఆయన ధైర్యసాహసాలను మెచ్చి ఇచ్చిన బిరుదు "వీర్" లేదా "వీరుడు". ఆయన కవిత్వం, సాహిత్యం చదివి భారతీయులెందరో ప్రేరణ పొంది స్వాతంత్ర్య పోరాటంలో కదం తొక్కారు. హిందువుల ఐక్యతకు కృషి చేస్తూనే ముస్లిమ్‌లకు ప్రత్యేక గుర్తింపును వ్యతిరేకించిన మేధావి సావర్కర్. మహాత్మాగాంధీ సిద్ధాంతాలను సహితం బహిరంగంగా వ్యతిరేకించిన ధీరుడు. గాంధీ హత్యలో భాగం ఉందనే నెపం వేయగా కోర్టులో నిరపరాధిగా బయట పడ్డారు. 01 ఫిబ్రవరి 1966న "ఆత్మార్పణ" చేసుకుంటానని ప్రకటించి ఆహారం తీసుకోవడం మానేసి 26 ఫిబ్రవరి 1966న వీరమరణం పొందారు. ఆయన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం సావర్కర్ చిత్రపటాన్ని 2003లో పార్లమెంటు ఆవరణలో ఆవిష్కరించారు.

**చిన్ననాటి నుంచే ఉద్యమ బాట:**

28 మే 1883న నాసిక్ జిల్లా భాగూర్‌లోని బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన వినాయక్ దామోదర్ సావర్కర్, తన 12వ ఏటనే మిత్రులను ఏకం చేసి సమాజ హితం కోరని ముస్లిమ్‌లకు వ్యతిరేకంగా ఉద్యమించారు. "మిత్ర మేళ", "ఫ్రీ ఇండియా సొసైటీ" లాంటి సంస్థలను స్థాపించి బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడారు. పూనెలో న్యాయపట్టాను పొంది ఉపకారవేతనంతో యూకెలో ఉన్నత విద్యను అభ్యసించారు. లాల్ బాల్ పాల్ త్రయం ప్రేరణతో స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. "ది హిస్టరీ ఆఫ్ ది వార్ ఆఫ్ ఇండియన్ ఇండిపెండెన్స్" అనే పుస్తకాన్ని రాసి భారతీయుల్లో దేశభక్తిని రగిలించారు. సావర్కర్ ఉద్యమాలను వ్యతిరేకించి బ్రిటీష్ పాలకులు ఆయనను అండమాన్ నికోబార్ "కాలా పానీ" సెల్యులార్ జైల్లో 50 ఏండ్ల పాటు శిక్ష వేసి బంధించి తీవ్రంగా వేధించారు.

**హిందూవాది – గాంధీ విధానాల వ్యతిరేకి:**

"హిందుత్వ : హూ ఈజ్ ఏ హిందూ ?" అనే కరపత్రం తీసి హిందు సమాజాన్ని జాగృత పరిచారు. బౌద్ధులు, సిక్కులు, పార్సీలు, హిందువులు మాత్రమే "అఖండ్ భారత్"లో ఉండాలని "భరతవర్ష్" అనే పేరును భారత్‌కు ఇచ్చారు. ప్రత్యేక గుర్తింపు పొందుతున్న ముస్లిమ్, క్రిస్టియన్లకు వ్యతిరేకంగా నిలిచి పోరాడారు. 1924లో "రత్నగిరి హిందూ మహాసభ"ను ఏర్పాటు చేసి "హిందూ మహాసభ"క నాయకత్వం వహించారు. శిలాఫత్ ఉద్యమ సమయంలో గాంధీ గారి ముస్లిమ్ పక్షపాత విధానాలను బహిరంగా వ్యతిరేకించి గాంధీని కపటుడిగా, సంకుచిత అపరిపక్వ మనస్తత్వం కలవాడని ప్రకటించారు.

భరతమాత ముద్దుబిడ్డ, పరమ దేశభక్తుడు, సాహితీవేత్త, హిందూ ఐక్యతా మూర్తి, రాజకీయవేత్త, న్యాయవాది, 59వ వర్ధంతి సందర్భంగా వారిని స్మరించుకుంటూ వారు చూపిన వీరత్వాన్ని పునికిపుచ్చుకొని మనం కూడా దేశభక్తులమని చేతల్లో నిరూపించుకుందాం, వీర్ సావర్కర్ చిత్రపటానికి మాలలు వేసి పాదాభివందనాలు చేద్దాం.

(26 ఫిబ్రవరి "వీర సావర్కర్ వర్ధంతి" సందర్భంగా)



–ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

## 'అక్షింతలు' ఆవిష్కరణ



పుస్తకావిష్కరణలో అతిథులు

హైదరాబాద్, ఫిబ్రవరి 25: సీనియర్ కార్టూనిస్టు సురేంద్ర, గజ్జెల మల్లారెడ్డి సంయుక్తంగా అందించిన అక్షింతలు కార్టూన్ సంకలన పుస్తకావిష్కరణ సభ ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. సీనియర్ జర్నలిస్ట్ మందలపర్తి కిషోర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు పాశం యాదగిరి, ఎన్. వేణుగోపాల్, తల్లావజుల శివాజీ, ప్రముఖ కవయిత్రి జర్నలిస్టు కొండేపూడి నిర్మల, రచయిత తాడి ప్రకాశ్, ప్రముఖ కార్టూనిస్టు నర్సిం, మృత్యుంజయలు 'అక్షింతలు' కార్టూన్ సంకలన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాశం యాదగిరి మాట్లాడుతూ శరీరాన్ని శుద్ధి చేసుకోవడానికి నీళ్లు అవసరం. ఆత్మను శుద్ధి చేసుకోవడానికి జ్ఞాపకాల వల్ల కారే కన్నీళ్లు అవసరమని అనా&్నరు. 'అక్షింతలు' అలాంటి జ్ఞాపకాల పుటల పుటల సమాహారమని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో పత్రికారంగ ప్రతినిధులు, కార్టూన్ అభిమానులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

నేటి నిజం

# సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com    website: www.netinijam.com



## సాహిత్యంతో సమాజాన్ని మేల్కొలిపే బాధ్యత రచయితలదే

-డా॥నందిని సిధారెడ్డి



పుస్తకావిష్కరణలో అతిథులు


హైదరాబాద్, ఫిబ్రవరి 25: సమాజం దారి తప్పుతున్న ఈ సమయంలో సాహితీవేత్తలు ముందుకు వచ్చి దిశానిర్దేశం చేయాలని పలువురు కవులు, రచయితలు పిలుపునిచ్చారు. సోషల్ మీడియాలో వీడియో పోరాటాలు పెరిగి, మానవీయ విలువలు క్షీణిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రెండు రోజుల తెలంగాణ సాహితీ దశాబ్ది సాహిత్యోత్సవాలు శనివారం ఏవీ కళాశాల ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. తెలంగాణ సాహితీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఆనందాచారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ కవి డా॥ నందిని సిధారెడ్డి హాజరై మాట్లాడారు. సాహిత్యం ద్వారా సమాజాన్ని మేల్కొలిపే బాధ్యత రచయితలదేనన్నారు. ఎమ్మెల్సీ గోరటి వెంకన్న మాట్లాడుతూ.. సామ్రాజ్యవాదం.. మతోన్మాదం విస్తరిస్తున్న ఈ సమయంలో కవులు, రచయితలు ప్రజల పక్షాన నిలబడి వారిని అప్రమత్తం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్ మాట్లాడుతూ.. ప్రగతిశీల సాహితీవేత్తలు సామాజిక మాధ్యమాల వేగాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. ప్రముఖ కవి నిఖిలేశ్వర్‌ను జ్ఞాపికతో సత్కరించారు. అనంతరం తెలంగాణ సాహితీ దశాబ్ది ఉత్సవాల ప్రత్యేక సావనీర్ విడుదల చేశారు. రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ ఏనుగు నరసింహారెడ్డి, కార్యదర్శి బాలాచారి, కేంద్ర సాహిత్య యువ పురస్కార గ్రహీత శివలింగప్ప, కాళోజీ అవార్డు గ్రహీత నెల్లుట్ల రమాదేవి, ప్రొ. బన్న ఐలయ్య, ప్రముఖ కవులు యాకూబ్, మువ్వా శ్రీనివాస రావు, డా॥ఎస్. రఘు, రాంపల్లి రమేశ్ ఏవీ కళాశాల ప్రిన్సిపల్ రాజలింగం పాల్గొన్నారు.


సభలో ప్రసంగిస్తున్న డా॥ నందిని సిధారెడ్డి

## ప్రత్యేకుడు

నేను ప్రత్యేకుణ్ణి
అని చెప్పిన క్షణంలోనే
నీ లోపలి న్యాయస్థానం
నిశ్శబ్దమైపోతుంది.
నేరం
పేరు మార్చుకుంటుంది?
"స్వతంత్రం"గా.
అహంకారం
వస్త్రం మార్చుకుంటుంది?
"స్వాభిమానం"గా.
నీ పిచ్చి పనులు
నీ సిద్ధాంతాలుగా
మారేంతవరకూ
నీవు వాటిని
పోషిస్తూనే ఉంటావు.
ప్రత్యేకత?
ఒక మత్తు.
దాన్ని తాగినవాడు
తన ప్రతిబింబాన్నే
ప్రవక్తగా ప్రకటిస్తాడు.
కానీ
రాత్రి నిశ్శబ్దంలో
నిన్ను నీవు అడిగే ప్రశ్నలు
ఏ తత్వాన్నీ
తట్టుకోలేవు.
"నీవు ప్రత్యేకుడివా?
లేక
నీ తప్పుల్ని
ప్రత్యేకంగా
అలంకరించుకున్నావా?".
సమాజాన్ని
తక్కువగా చూసే చూపు
చివరికి
తననే చిన్నబుచ్చుకుంటుంది.
ప్రత్యేకత నిజమైతే?
అది ఒంటరితనాన్ని భరిస్తుంది;
అబద్ధమైతే ?
అది ప్రశంసల కోసం
అర్రులు చాస్తుంది
నేను ప్రత్యేకుణ్ణి
అని చెప్పడం సులువు;
ఇప్పుడు చెప్పు
నీవు ప్రత్యేకుడివా?
ఆ మాట
ఒక్క సారి
నీతో నీవు
చెప్పు చూద్దాం.

-మువ్వా శ్రీనివాసరావు
సెల్: 9948099900



## తెలంగాణ వికాస సమితి నూతన కార్యవర్గం


దేశపతి శ్రీనివాస్    వనపట్ల సుబ్బయ్య    విజయానంద్

హైదరాబాద్, ఫిబ్రవరి 25: తెలంగాణ అస్తిత్వ పరిరక్షణే ధ్యేయంగా, ఉద్యమకారుల పూనికతో ఆవిర్భవించిన తెలంగాణ వికాస సమితి (తెవిస) నూతన కార్యవర్గాన్ని ఆదివారం హైదరాబాద్‌లో ఎన్నుకున్నారు. సమితి నూతన అధ్యక్షుడిగా ప్రముఖ కవి, ఉద్యమకారుడు వనపట్ల సుబ్బయ్య , ప్రధాన కార్యదర్శిగా మల్లావరఘుల విజయానంద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మెల్సీ, సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దేశపతి శ్రీనివాస్ ఇక నుంచి గౌరవాధ్యక్షుడిగా కొనసాగుతూ దిశానిర్దేశం చేయనున్నారు. దేశపతి నేతృత్వంలో హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన సమితి కార్యవర్గ ప్రత్యేక సమావేశంలో ఈ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నా రు. తెలంగాణ అస్తిత్వాన్ని, సంస్కృతిని కాపాడుకోవడంలో నూతన కార్యవర్గం క్రియాశీలక పాత్ర పోషిస్తుందని కార్యవర్గ సభ్యులు ఈ సందర్భంగా వెల్లడించారు. సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై సమితి చర్చించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను సమితి కార్యవర్గం తీవ్రంగా ఖండించింది. గాంధీ సరోవర్ పేరిట మధు పార్క్‌రిడ్జ్ అపార్ట్‌మెంట్ల విధ్వంసానికి పూనుకోవడాన్ని తప్పుబట్టింది. సామాన్యుల ఆస్తులను ధ్వంసం చేస్తూ, బడా పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం పని చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది తెలంగాణ ఆత్మ గౌరవానికి విరుద్ధమని కార్యవర్గం హెచ్చరించింది. తెలంగాణ సమాజం పక్షాన నిలబడి, ఇలాంటి అప్రజాస్వామిక చర్యలను నిరంతరం ప్రశ్నిస్తామని కార్యవర్గ సభ్యులు తెలిపారు.

## తెలియడమే లేదు!

జీవితం ఒక నిరంతర ప్రవాహం
అందులో
కొట్టుకుపోతుంటామే తప్ప
దాని వేగాన్న లోతునూ
గమనించే లోపే
దాటి పోతుంటాం తీరాన్ని దాటి.
తొలి శ్వాసతో మొదలైన రోదనలో
లోకంతో పరిచయమైన సంగతే
తెలియలేదు.
అమ్మ ఒడిలో వెచ్చని స్పర్శలో
కాలం కరిగిపోతున్న ఊసే
తెలియలేదు.
తొలకరి అడుగుల తడబాటులో
పరుగులెత్తే యవ్వనం
ఎప్పుడొచ్చిందో తెలియలేదు.
కలల వెనుక పరుగులు తీస్తూ
కళ్ల కింద ముడతలు పడ్డ సంగతే
తెలియలేదు.
నమ్మకం మంత్రంలా పనిచేస్తుందని
అనుమానం విషంలా
చంపేస్తుందనితెలియలేదు.
గెలుపు కిరీటం కోసం పడ్డ
ఆరాటంలో
ఓటమి నేర్పిన (గుణ)పాఠం
విలువ తెలియలేదు.
సుఖాల వేటలో
అలసిపోయిన ప్రాణానికి
దుఃఖం పంచిన నిగూఢ సత్యం
తెలియలేదు.
నాది, నా వాళ్లు అనే
మమకారపు మాయలో
నేనెవరో నాకు నేనే తెలియలేదు.
గమ్యం కోసం వెతుకులాటలో
అసలు గమనమే ఆగిపోతుందని
తెలియలేదు.
అన్నీ జరిగిపోతున్నాయి
ఏదీ ఆగడం లేదు!
జీవితం అంటే
ప్రవహిస్తూ అనుభవించడం తప్ప
అర్థం చేసుకోవడం సాధ్యం కాదని
తెలియడమే లేదు.
జీవితం ఒక రహస్యం
అది గడుస్తున్న కొద్దీ
విడివడే చిక్కుముడి కాదు
గడిచిపోయాక మిగిలే
ఒక పరిపూర్ణ శూన్యం
తెలుసుకోవాలి' అనుకునే లోపే
'అయిపోవడం'
దాని నైజం.

-ఆచార్య కడారు వీరారెడ్డి
9392447007



## సప్త పదులు

మనం
యానం

జీవన ప్రయాణంలో
చెయ్యాలి
కొంతైనా
దానం
-సరోజ రెబ్బాప్రగడ
9673306023

ఆస్తి
జాస్తి

అహంకారం
పరిమితి దాటితే
తప్పదు
శాస్తి
-విత్తనాల విజయకుమార్
9985117789

జనం
వనం

చెట్లని
రక్షిస్తే
వచ్చేను చల్లని
పవనం
-సరోజ రెబ్బాప్రగడ
9663306023

పత్రం
ఛత్రం

రణభూ కాక
శాంతినిచ్చేది
కావాలి
క్షేత్రం
-కె. వి. వి. సత్య ప్రసాద్
7396301014

## మాతృభాషను మరచిపోతే మనుగడ ఉండదు

-మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యా సాగర్‌రావు


మామిడి హరికృష్ణను సత్కరిస్తున్న మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యా సాగర్‌రావు. వేదికపై డా॥ నాళేశ్వరం శంకరం, విమలక్క, ఐనంపూడి శ్రీలక్ష్మి తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 25: విక్రమార్జున విజయం లాంటి అద్భుతమైన సాహిత్య సృష్టి చేసి చివరి ఘడియలన్నీ తన జన్మస్థలమైన బోధన్‌లోనే గడిపిన, నిఖార్సయిన తెలంగాణ బిడ్డ పంపన అని అలాంటి పంపన విగ్రహాన్ని మ్యూజియాన్ని ట్యాంక్‌బండ్ మీద ప్రతిష్ఠించి తెలంగాణ సాహిత్యానికి నీరాజనం అర్పించాలని మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా అక్షరయాన్, అభిజ్ఞ భారత్, సీతాస్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా బేగంపేటలో నిర్వహించిన మహాకవి పంపన జాతీయ పురస్కార ప్రదానోత్సవంలో ఆయన మాట్లాడారు. మాతృభాషని మరచిపోతే మనుగడ ఉండదని, అలా అని ఇతర భాషలపై ద్వేషం అక్కరలేదన్నారు. అక్షరయాన్ తెలుగు విమెన్ రైటర్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు శ్రీలక్ష్మి మాట్లాడుతూ.. మాతృభూమి, మాతృదేశం, మాతృభాష ఈ మూడు నిత్యస్ఫూర్తి ప్రదాతలన్నారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ రావు మామిడి హరికృష్ణకు స్వర్ణ కంకణధారణ చేసి **'పంపన జాతీయ పురస్కారాన్ని'** అందించారు. జానపద విజ్ఞానం పరిషత్ అధ్యక్షురాలు వసుంధర రెడ్డి, రసగీతి వ్యవస్థాపకులు మహిపాల్‌రెడ్డి, తెలంగాణ కన్నడ సాహిత్య పరిషత్తు అధ్యక్షుడు విఠల్‌జోశి, బోధన్ పంపన పీఠం అధ్యక్షులు పురాణే అజయ్‌కు మార్‌లకు భాషాసేవ విశిష్ట పురస్కారాలు, సదానందశాస్త్రి, నాగరాజయ్య, కె.ఆర్.గణేశ్, సుబ్రహ్మణ్యం, కెందోలి, యాదవరావులకు పురస్కారాలు అందజేశారు.

## కుటుంబ వ్యవస్థను కాపాడుకుంటేనే ప్రగతి


లంక లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న అతిథులు.

హైదరాబాద్, ఫిబ్రవరి 25: కుటుంబ వ్యవస్థను కాపాడుకుంటేనే భారతదేశం మరింత ప్రగతిపథంలో ముందుకు పోతుందని హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ భవానీప్రసాద్ అన్నారు. మంగళవారం త్యాగరాయ గానసభలో సుప్రసిరి ఆర్ట్స్ అసోసియేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ వ్యాఖ్యాత, వక్త, యువకళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణను మదుర వచోధురీణ బిరుదుతో ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ భవానీ ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రపంచంలో భారతదేశానికి గొప్ప పేరు రావడానికి మనకుటుంబ వ్యవస్థ ప్రధాన కారణ మన్నారు. లక్ష్మీనారాయణ తెలుగు భాషపై పట్టుతో ప్రసంగాలు చేయడం గొప్ప విషయమని, గతలో న్యాయశాఖ ఉద్యోగి గా ఉద్యోగుల మధ్య సఖ్యత చేకూర్చడంలో ఎంతో కృషి చేశారన్నారు. సభాధ్యక్షత వహించిన దూరదర్శన్ మాజీ డైరెక్టర్ డా॥పాలకుర్తి మధుసూదనరావు, సినీనటులు సుబ్బరాయశర్మ మాట్లాడుతూ, లక్ష్మీనారాయణ వచనాదురంధ రులు, సరస్వతీపుత్రులు అన్నారు. నటులు శవశంకర శాస్త్రి కథక్ నాట్యాచార్యులు డా. అంజుబాబు, నిర్వాహకుడు, ప్రముఖ గాయని వి.కె.దుర్గ పాల్గొన్నారు. తులసీతీర్థం నాటక ప్రదర్శనతో పాటు వి.కె.దుర్గ ఆధ్వర్యంలో సినీ గీతాలాపన కార్యక్రమం జరిగింది.

కూర చిదంబరం రచనలు **'సమీక్షా సౌరభాలు'**కు సంకేపల్లి నాగేంద్రశర్మ, **'సమీక్షా సుమమాలిక'**కు విహారిగారు రాసిన ముందుమాటలు..

## నిత్య అధ్యయనశీలి మా బావ, చిదంబరం

బంగారం విలువైనదే! సందేహం లేదు, కాని దాని నాణ్యత పరీక్షించాలంటే గీటురాయి కావాలి. అలాగే సాహిత్యానికి వెలకట్టే షరాబులు సమీక్షకులు, సమీక్ష అంటే సమవీక్షణం. ముందే నిర్ణయించుకున్న అభిప్రాయాలకు లొంగకుండా, ఒక రచన విలువ తెలిపేది సమీక్ష. ఆ రచనలో గట్టి గింజ ఎంతో, తాలు ధాన్యం ఎంతో తెలుసుకోవటానికి సమీక్షలు అత్యవసరం. పలు సర్వేల అనంతరం తేలిందేమంటే- ఒక పుస్తకాన్ని కొనేముందు పాఠకులు ముందు మాట /పీఠికలు చదువుతారు. ఆ పుస్తకం గురించి, రచయిత గురించి, ఒక అభిప్రాయానికి వచ్చిన తర్వాతే కొనాలన్న నిర్ణయానికి పచ్చజెండా పడుతుంది.

మా బావ కూర చిదంబరం వృత్తి రిత్యా చార్టర్డ్ ఎకౌంటెంట్. ప్రవృత్తి రిత్యా సాహిత్యాభిమాని, చిన్నతనం నుండే సాహిత్యంపై మక్కువ. దీనికి తోడు తను పుట్టి పెరిగిన ఊరు వేములవాడలో శ్రీ రాజరాజేశ్వరాలయం, భీమేశ్వరాలయాల్లో పలు సాహిత్య గోష్టులకు హాజరవటం వల్ల ఆయనలోని సాహిత్యాభిలాష అనే నారుకు నీరు పోసినట్లయింది.

బీ.కాం చదువుతూన్న రోజుల్లోనే (1961-64) ఉస్మానియా విశ్వ విద్యాలయం కేంపస్ లోని కొండమీద వెలిసిన గ్రంథాలయం, అందులోని వేలకొద్ది పుస్తకాలు ఆయన్ను అమితంగా ఆకర్షించాయి. కాస్త విరామం దొరికితే చాలు, పుస్తకాల నేస్తాలను పలుకరించేవారు. ప్రతీ ఆదివారం కృష్ణ దేవరాయాంధ్ర బాషానిలయం, సిటీ సెంట్రల్ లైబ్రరీలో గంటల తరబడి గడిపేవారు. కథంటే ఏమిటో, స్కెచ్ అంటే ఏమిటో తెలియని పిన్నకాలంలోనే మా వేములవాడ ప్రభుత్వోన్నత పాఠశాల విద్యార్థి సంఘంవారు నిర్వహించే లిఖిత పత్రిక 'భాను' లో వీరి కథ ప్రచురించబడిందట!

బీ. కాం. విద్యార్థి జీవితంలో అచ్చులో చూసుకున్న మొదటి కథ 'తనను గురించిన నిజం' ప్రథమ బహుమతి గెలుచుకుని హాస్టల్ మ్యాగజైన్ 'ఉషస్సు' లో ప్రచురించబడింది. ఆ తర్వాతి కాలంలో అ.౦ చదువుతున్న రోజుల్లో (1964-67) 5-6 కథలు ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక, పొలికేక అన్న వార పత్రికలలో ప్రచురించబడ్డాయి.

ఉద్యోగనిర్వహణ కాలంలో 'సయాటికా' అన్న సమస్యవల్ల దూరం కావలసి వచ్చింది. అది చిదంబరం బావ సాహిత్య జీవితంలో పెద్ద మలుపు. తన్ను తాను ఏదో ఒక వ్యాపకంలో నియోగించుకునే సందర్భంలో తిరిగి సాహిత్యం వైపు దృష్టి మరలించారు. కథలు, వ్యాసాలు రాశారు. సమీక్షలు చేశారు.

'ఆలోచనాలోచనాలు' అన్న శీర్షిక క్రింద 'వాసవి ప్రభ' అనే సామాజిక త్రైమాస పత్రికలో వ్యాసాలు రాసేవారు. అప్పుడప్పుడే ప్రారంభించిన 'సాక్షి' దిన పత్రికలో ఆధ్యాత్మిక వ్యాసాలు, కథలు, సమీక్షలు రాసేవారు. 'వార్త' పత్రిక వారి ఆదివారం అనుబంధం పర్యవేక్షించే శ్రీ గుడిపాటి వెంకటేశ్వర్లు మరియు 'నేటి నిజం' పత్రిక సంపాదకులు బైసా దేవదాసు గారల సహకారం, ప్రోత్సాహం మరువలేనిది అంటారు.




గత పుష్కర కాలంలో సుమారు 1500 దాకా సమీక్షలు, కథలు, వ్యాసాలు, రాసి ఉంటారు. వాటిలోంచి ఏర్చి కూర్చిన సుమారు 100 పుస్తకాలపై, వివిధ పత్రికలలో ప్రచురించబడిన సమీక్షలివి. పైన చెప్పినట్లు తానూ ఓ గీటురాయై ఇవన్నీ సమీక్షించారు, విశ్లేషించారు.

సాహిత్యాసక్తులైన పాఠకులకు దీపధారియై ముందు నడిచారు. నేటి కాలానికి సమీక్షలపై వస్తున్న సాహిత్యం బహు కొద్ది. రాచపాళెం, అంపశయ్య, విహారి, కే పి అశోక్ కుమార్, పి జ్యోతి, దాస్యం సేనాధిపతి, గుడిపాటి, రమణ, వెలమకన్ని, జయ సూర్య, వెల్దండి శ్రీధర్, శైలజా మిత్ర, ఎం.వి. రామిరెడ్డి, వారాల ఆనంద్, మరెందరో ప్రముఖులు రాస్తున్నా, పుస్తక రూపకంగా చాలా తక్కువ వచ్చాయి. ఆ లోటును కొంతవరకు ఈ పుస్తకం పూరిస్తుందని నా గట్టి నమ్మకం.

ఈ సంపుటిలో ఈ సమీక్షలు చదువుతుంటే రచయిత శస్త్ర చికిత్స చేస్తూ, ఖండ ఖండాలుగా విడగొట్టి, ఖండించి, విమర్శించి, తాను గొప్ప సమీక్షకుడిని వీరతాడు వేయించుకునే ప్రయత్నంలాగా అనిపించదు. పుస్తక రచయితలు, వారి రచనల్లోని మంచిని, గొప్పతనాన్ని హైలైట్ చేసినట్లు అవుపించుతుంది.

-సంకేపల్లి నాగేంద్రశర్మ
8074826371




81 లో అడుగిడిన నిత్య అధ్యయనశీలి, మా చిదంబరం బావకు అభినందనలు. మరిన్ని మంచిమంచి సమీక్షల సౌరభాన్ని ముందు ముందు మనకు పంచుతారని ఆశిద్దాం.

సదా తోడుగా నిలిచి సహకరిస్తున్న సుమిత్ర అక్క, చిదంబరం బావలకు మా వేములవాడ రాజరాజేశ్వరుడు ఆయురారోగ్యాలు ఇచ్చి ఆశీర్వదించాలి.




## ప్రయోగం ప్రయోజనం వెరశి ఈ సమీక్షాకృతి






-విహారి
9848025600

ఇది 'సమీక్షా సుమమాలిక' సింహప్రసాద్‌గారి పుస్తకాలపై కూరచిదంబరంగారి సమీక్షా సంపుటి.

వీటిలో 8 కథా సంపుటాలు, 21 నవలలు, 1 ఆధ్యాత్మిక గ్రంథం ఉన్నాయి. తెలుగు పాఠక లోకానికి తన రచనల ద్వారా అత్యంత సాన్నిహిత్యం కల రచయిత సింహప్రసాద్. సుమారు 80 నవలలు, 500 కథలు ఈ ప్రాచుర్యానికి కారణం. రాశిలో ఎంతటి ప్రసిద్ధి చెందినవో, ఈ రచనలు వాసిలోనూ అంతటి ప్రశంసల్ని పొందినవి. వీటిలో సగానికి పైగా వివిధ బహుమతులు పొందినవి. సింహప్రసాద్ అంటేనే 'బహుమతుల రచయిత'. అదొక రికార్డు. ఆయన రచనలన్నీ వస్తు వైవిధ్యానికీ వర్తమాన సామాజిక సమస్యలకూ పెట్టింది పేరు. కథలూ, నవలలూ కాక సింహప్రసాద్ రచించిన 'తిరుమల దివ్యక్షేత్రం, వివాహవేదం' లాంటి ఉత్తమోత్తమ గ్రంథాలు ఉన్నాయి.

కూర చిదంబరం గారు ఉత్తమ సారస్వతీయులుగా ప్రసిద్ధులు. కథకులు, వ్యాసకర్త, జగమెరిగిన సమీక్షకులు ఈ సంపుటిలోని విశేషం. ఒక రచయిత రచనలపై ఒక్క సమీక్షకుడు చేసిన విశ్లేషణలు ఉండటం. దీనివలన ఆ రచనల అంతర్యాన్నీ, ఆ రచయిత రచనా నైపుణ్యాన్నీ ఒక్కచోట దర్శించే అవకాశం కలుగుతోంది. అలాగే, ఒక్క చేతిమీద వచ్చిన సమీక్షలుగా- ఆయా విశ్లేషణల అంతస్సత్యాన్ని అర్థం చేసుకునే వీలు కలుగుతోంది. అలాగే రచయిత ప్రాపంచిక దృక్పథం సమీక్షకుని వివేచనా సాంద్రత కూడా అవగాహనకు వస్తున్నాయి.

చిదంబరం గారి సమీక్ష ఒక ప్రణాళిక ప్రకారం సాగుతుంది. సమీక్ష శీర్షికే ఆలోచనాత్మకంగా వుంటుంది. పుస్తకంలోని కథాత్మను వెల్లడిస్తుంది. 'బతకాలి' సంపుటి సమీక్ష శీర్షిక- 'మారుతున్న కాలానికి మలచిన కథలు' అన్నారు. 'అభయం' నవలకు 'కార్పోరేట్ హస్పిటళ్ల తీరు తెన్ను' అన్నారు.

ఆ తర్వాత విషయ నేపథ్యాన్ని వింగడిస్తారు. అప్పుడు ఉద్దిష్ట వస్తు నిర్దేశమేమిటో వివరిస్తారు. కథ, నవల, ఇతివృత్తాన్ని క్లుప్త సుందరంగా ఆవిష్కరిస్తారు. చివరికి కథ, నవల సందేశాత్మకతను, ప్రయోజనాన్నీ విశ్లేషిస్తారు. ఇలా మొత్తం నా రచన గురించి ఒక దృశ్యస్పృహను కలిగిస్తారు.

రచనా గుణ వైశిష్ట్యం కలిగిన ఈ విధానం వలన చిదంబరం గారి సమీక్ష- పఠితలో ఆ రచనను అనుభూతిని పొందాలనీ, తద్వారా ఇంకా గాఢమైన అనుభూతిని పొందాలనీ- 'ఒక ఉత్సుకత కలుగుతుంది. ఉత్తమ గ్రంథ సమీక్ష ధ్యేయం-కడకు- పాఠకుని అసలు మూల గ్రంథ పఠనానికి ఉద్యుక్తుని చేయటమే కదా! నిజానికి ఇదే సమీక్షకుడు, సాధించవలసిన విజయం.

ఈ విజయాన్ని (సుమారు 200పైగా చేసిన సమీక్షల ద్వారా) సాధించి, ప్రసిద్ధి వహించిన రచయిత చిదంబరం గారు! ప్రయోగాత్మకంగా వస్తున్న ఈ సమీక్షా సంకలనం- అటు సింహ ప్రసాద్ గారికీ ఇటు చిదంబరం గారికీ అపూర్వమైన కీర్తి ప్రతిష్ఠల్ని సమకూర్చాలని శుభాకాంక్షల్ని అందిస్తున్నాను. ఇరువురు మహా రచయితలకూ హృదయపూర్వక అభినందనలు!

# మొగ నెమలి మోసపాయే..!

(కథ)

“గాంభీర్యాన్ని అరువు తెచ్చుకుని స్టాఫ్‌తో బింకంగా మాట్లాడడం తగ్గించాలి.. మనిషి అనేవాడు ఏ పొజిషన్‌లో ఉన్నా.. గ్రూప్‌లో ఉన్నా... ఒంటరిగా ఉన్నా.. అప్పుడప్పుడు ‘లోన్లీనెస్‌గా’ ఫీలవుతాడు.. లాజిక్ లేకుండానే బాడీలో జరిగే ఈ కెమికల్ రియాక్షన్ మనిషిని ఇమోషనల్‌గా బ్రేక్ డౌన్ చేస్తుంది”

‘నోరు మాట్లాడుతుంది.. మనసు మాట్లాడుతుంది. కళ్ళు మాట్లాడతాయి.. అని విన్నాను కానీ, ఇదేంటి... నిన్ను చూస్తూంటే నా ఒళ్ళంతా తుళ్ళింతతో కేరింతలు కొడుతుందేమిటి..?’ సుతి మెత్తని ఆమె చేతుల్ని తన చేతిలోకి తీసుకుంటూ అడిగాడు కార్తీక్..

ఆమె చిన్నగా, సన్నగా నవ్వింది..

‘నేనో వెదురును.. రాగాలు పలికిస్తుంది నువ్వే..! నేనో మూగ వీణని.. తంత్రులు సరిచేస్తుంది నువ్వే.. నీ ఒళ్ళంతా తుళ్లింతలకు కారణం నేను కాదు.. నీ కళ్ళలోని మెరుపు నా దేహాన్ని తాకి బూమరాంగై నిన్ను కుదిపేస్తోంది. ఇది మన మధ్య ఉన్న బంధాన్ని రిఫ్లెక్ట్ చేస్తోంది..’ అంది లోగొంతుతో.. ఆమె పేరు కావ్య.

గిర్‌గావ్ చౌపాటిలోని ఇసుక తిన్నెలపై చిలుకా గోరింకల్లా కూర్చున్నారు వాళ్లిద్దరు.. సముద్రం వైపు చీకటిగా ఉంది. కానీ,పక్కనే ఉన్న మెరీన్ డ్రైవ్ విద్యుత్ కాంతుల్లో ధగధగా మెరిసిపోతోంది. లెక్కకు మించిన వాహనాలు రయ్‌మని దూసుకుపోతున్నాయి.

బీచంతా జనంతో గందరగోళంగా ఉంది. ఎవరి హడావిడి వారిదే..!

కార్తీక్, కావ్యలకు చుట్టుపక్కల ఉన్న జనం ఎవరూ కనిపించడం లేదు. వాళ్ళిద్దరూ సమూహంలో ఒంటరిగా విశాలాకాశం కింద చీకటి వెలుగుల దోబూచులాటలో తమను తాము మరిచిపోయి మురిసిపోతున్నారు.

‘కావ్యా..! ఇంత పెద్ద నగరంలో ఒంటరిగా ఉన్న నాకు నీ సాహచర్యం లభిస్తుందనీ, జీవితం ఇంత ఉత్తేజంగా, ఉల్లాసంగామారుతుందని నేనేనాడు అనుకోలేదు... నీ తోడు లభించడం నిజంగా నా అదృష్టం’ అన్నాడు కార్తీక్. కావ్యను చూస్తూ చూస్తూ ఆయన యుగాలను క్షణాలుగా గడిపేసే స్థితిలో ఉన్నాడు.

‘మనం మొదటిసారి కలుసుకున్న ఆ రోజు గుర్తుందా కార్తీక్..? సీలార్డ్‌లో సెమినార్... నీ మాటలు.. అప్పుడప్పుడు నా వైపు చూసిన చూపులు.. ఆ క్షణమే కదా..! మనిద్దరిలో ఏవో తెలియని ఫీలింగ్స్ ఎగిసిపడ్డాయి..!’ అంది కావ్య తమకంగా..

‘యస్..! నేనెలా మరిచిపోగలను..? ఆ రోజనేది నా జీవితంలో జరిగి ఉండకపోతే, నేను జీవితంలో అద్భుతాన్ని

కోల్పోయేవాడ్ని.. థాంక్స్ టు ది సెమినార్..’ అంటూ కార్తీక్ ఆనాటి జ్ఞాపకాల్లోకి జారుకున్నాడు..

×××

హోటల్ సీలార్డ్..!

దూరంగా కోస్టల్ రోడ్ పరుగెత్తుతోంది.. సీలింక్ పై వెలుగులు ప్రవహిస్తున్నాయి. హోటల్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నెట్‌వరల్డ్

కంపెనీ వారి సెమినార్ జరుగుతోంది. ‘ఐటి ఉద్యోగుల్లో మొనాటనీ పోవాలంటే ఎలా..?’ అనేది ఆ నాటి సబ్జెక్ట్. సిటీలో పేరొందిన పర్సనాలిటి డెవలప్‌మెంట్ పాఠాలు చెప్పే ఓ మోటివేటర్ కీ నోట్ స్పీకర్‌గా వచ్చాడు..

‘మై డియర్ ఫ్రెండ్స్..! ఒకే పనిని ఒకే పద్ధతిలో నిరంతరం చేస్తుంటే ఒక రకమైన మొనాటనీ ఏర్పడడం సహజం. ఎంత

మంచి జోకైనా మళ్ళీమళ్ళీ వింటే బోరేస్తుంది. నాకు తెలుసు.. మీ పై విపరీతమైన వర్క్ ప్రెషర్ ఉంటుంది. పైగా రొటీన్‌గా ఒకే రకమైన కోడింగ్‌లు .. డీకోడింగ్‌లు.. అదే లాప్‌టాప్.. అదే కీ బోర్డు.. అదే నొక్కడం..! మరేం చేయాలి..? ఆసక్తిగా, సరదాగా పని చేయాలంటే

పరిసరాల్లో ఎలాంటి మార్పులు కోరుకుంటు న్నారు..? మీకు మీ ఆఫీస్‌లో ఎలాంటి మార్పులు కావాలి..? మీరు ఒకరొకరుగా ముందు చెబితే, ఏం చేయాలో... ఎలా చేయాలో నేను చెబుతాను.. కమాన్..! ఒకరొకరుగా మీ ఒపీనియన్ చెబుతూ ఉండండి..’ అంటూ ఉత్సాహపరిచాడు మోటివేటర్..

‘సార్..! స్టాఫ్‌లో అమ్మాయిల్ని పెంచండి..’ అన్నాడు సుధీర్.

భళ్ళుమని నవ్వారు అక్కడున్న వారంతా..

‘సర్..! టాకింగ్ జోన్‌లు ఏర్పాటు చేసి ప్రతి రెండు గంటల కొకసారి అరగంట సేపు అనివార్యంగా మేల్, ఫిమేల్ పర్సనల్‌గా బాతాఖానీ చేసుకునే అవకాశం కల్పించాలి...’ అన్నాడు జోసెఫ్..

మెల్లిగా తలూపాడు మోటివేటర్.. గుర్రుగా చూశాడు బాస్ జోసెఫ్ వైపు. జోసెఫ్ ముఖం తిప్పుకున్నాడు.

‘నాలుగు గంటలకొకసారి బ్రేకిచ్చి రెండు పెగ్గులు సర్వ్ చేయాలి సర్..’ గుంపులో నుండి ఎవరో అన్నారు.. అక్కడ నవ్వులు బ్లాస్టయ్యాయి..

‘బీ సీరియస్..! ఆఫీస్ కళకళలాడాలంటే... స్టాఫ్ అంతా ఎంజాయ్ చేస్తూ పనులు చేయాలంటే ఏం చేయాలో ఇన్నోవేటివ్‌గా సజెస్ట్ చేయండి.. ఇది మీకు సంబంధించిన చర్చ..’ అన్నాడు మోటివేటర్.

‘సర్..! ఇంటికంటే ఎక్కువ టైమ్ మేం ఆఫీస్‌లోనే స్పెండ్ చేస్తాం. అన్నప్పుడు ఆఫీసులో ఇంటి కంటే మంచి అంబియెన్స్‌ఉండాలి.. ముఖ్యంగా స్టాఫ్ మధ్య మంచి అండర్‌స్టాండింగ్ ను పెంచే ప్రయత్నం చేయాలి.. ఒకరి పట్ల ఒకరు కేరింగ్‌గా ఉన్నట్లు అనిపించాలి. వర్క్ డిస్ట్రిబ్యూషన్‌తో పాటు హాపీనెస్‌ను కూడా పంచుకునే వీలుండాలి.. బాస్ అంటే ముభావంగా ఉంటూ, లేని పోని గాంభీర్యాన్ని అరువు తెచ్చుకుని స్టాఫ్‌తో బింకంగా మాట్లాడడం తగ్గించాలి.. మనిషి అనేవాడు ఏ పొజిషన్‌లో ఉన్నా.. గ్రూప్‌లో ఉన్నా... ఒంటరిగా ఉన్నా.. అప్పుడప్పుడు ‘లోన్లీనెస్‌గా’ ఫీలవుతాడు.. లాజిక్ లేకుండానే బాడీలో జరిగే ఈ కెమికల్ రియాక్షన్ మనిషిని ఇమోషనల్‌గా బ్రేక్ డౌన్ చేస్తుంది.. అలాంటి పరిస్థితిని రానీకుండా, స్టాఫ్ ఇంక్లూడింగ్ బాస్... ఒకరి విషయాలు ఒకరు షేర్ చేసుకునే ప్లీజంట్ అట్మోస్ఫియర్‌ను క్రియేట్ చేయాలి.. సర్..! స్టాఫంటే జీతభత్యాలు తీసుకునే మెషిన్స్ కాదు.. హ్యూమన్ బీయింగ్స్..! యంత్రాలకు, మనుషులకు మధ్య ఉన్న బేధం ఏంటంటే... లవ్.! యస్.. లవ్..! లవేబుల్ పరిసరాల్లో పని చేయడం ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. లవ్ అంటే మేల్..ఫిమేల్ మధ్య ఉండే అట్రాక్షన్ మాత్రమే కాదు.. మనిషిని మనిషిగా ప్రేమించడం.. వ్యవహరించడం..! ఈ సబ్జెక్ట్ పై అవేర్‌నెస్ పెంచేందుకు అప్పుడప్పుడు మీ లాంటి వారితో సెమినార్‌లునిర్వహించడం ఉపయోగంగా ఉండొచ్చు..’ అన్నాడు కార్తీక్ మాట్లాడుతూ..

ఒక క్షణం అక్కడ నిశ్శబ్దం రాజ్యమేలింది.. మరు క్షణం మోటివేటర్ కొట్టిన క్లాప్స్‌తో ఆ హాల్ ప్రతిధ్వనించింది. బాస్ కూడా కుర్చీనుండి లేచి చప్పట్లు కొట్టడంతో స్టాఫ్ అంతా అనుసరించారు.

అందరి చప్పట్లు ఆగిపోయినా ఒక అమ్మాయి ఇంకా చప్పట్లు కొడుతూనే ఉంది. కార్తీక్ తలతిప్పి అటువైపు చూశాడు.

మెరుపుతీగలా ఉంది. బ్లూకలర్ డెనిమ్ జీన్స్‌పై యెల్లో ప్రింటెడ్ టీషర్ట్ వేసుకుంది. చేతిలో లైమ్ గ్లాస్ ఉంది. కార్తీక్ చూపులతో ఆమె చూపులు కలిసుకున్నాయి..

‘అవున్సార్..! అయాం కావ్య.. నేను కూడా కార్తీక్‌తో ఏకీభవిస్తున్నాను..’ అంది.

‘బ్యూటిఫుల్ నేమ్’ మనసులో అనుకున్నాడు కార్తీక్.

‘వెల్..! థాంక్యూ కావ్యా..! సపోర్ట్ చేసినందుకు..’ అన్నాడు ఆమెను చూస్తూనే.. కార్తీక్ చూపులు తన పై నుండి పక్కకు పోవడం లేదన్న విషయాన్ని కావ్య పసిగట్టింది. ముసిముసిగా నవ్వుకుంది. ఇలా జరగడం మొదటిసారి కాదు. తనను చూసిన ఎవరైనా కాసేపు తదేకంగా చూస్తూ ఉండాల్సిందే..! అది ఆమెకు తెలుసు..!

‘వెల్ సెడ్ మిస్టర్ కార్తీక్..! స్టాఫ్ మెంబర్‌గా మీరు చెప్పినవి కొన్ని జరగొచ్చు.. జరగకపోవచ్చు కానీ, హర్షోల్లాసాలతో, అంకిత

భావంతో పని చేయనంత వరకు ఏ కంపెనీ కూడా ప్రొగ్రెస్ సాధించదు. యస్..! మీరన్నట్టు తోటి స్టాఫ్‌ను, చేస్తున్న పనిని ప్రేమించినప్పుడే సంతోషంగా పని గంటలు పూర్తి చేయగలుగుతారు.. ఐ అప్రిషియేట్ యు..!’

సెమినార్ జరుగుతున్నంత సేపు కార్తీక్ చూపులు కావ్యను వెంటాడుతూనే ఉన్నాయి.. కావ్య అది గమనిస్తూనే ఉంది..

అరగంట బ్రేక్ ఇచ్చారు..

×××

‘సూపర్ కార్తీక్..! బాగా మాట్లాడావు.. ముఖ్యంగా లవ్ ఉండాలన్నావ్ చూడూ..! ఫెంటాస్టిక్..! నాకు మన కొలీగ్ లీలావతితో నాకు లవ్ అయింది.. ఎలా ప్రొసీడ్ కావాలో కాస్త చెప్పవూ..?’ అంటూ కన్నుగీటాడు జోసెఫ్..

నవ్వాడు కార్తీక్ సిగరెట్ పీల్చుతూ..

ఎక్కడ ఏ ఐటీ ఆఫీస్ ముందు చూసినా, ఐటీ ప్రొఫెషనల్స్ పది మంది ఎక్కడ గుమి గూడినా వారిలో చాలా మంది సిగరెట్స్ ఎందుకు తాగుతారో అర్థం కాదు కానీ, సెమినార్ బ్రేక్‌లో బయటకు వచ్చిన వాళ్ళలో కొందరు తన్మయత్వంతో సిగరెట్ తాగుతున్నారు..

‘ఓహ్..! మీరు కూడా సిగరెట్ తాగుతారా..?’ అంటూ పలకరించింది కావ్య..

కాస్త తత్తరపడ్డాడు కార్తీక్.

‘అబ్బే..! రెగ్యులర్‌గా కాదండి..! ఎప్పుడైనా ఫ్రెండ్స్ బలవంతం చేస్తే సరదాగా ఒకటి అరా.. అంతే..!’ అన్నాడు తడబడుతూ కార్తీక్..

‘నాన్సెన్స్..! యూ లయ్యర్..! మనమున్నది ఇక్కడ ముగ్గురం.. మన ముగ్గురిలో ఎవడ్రా నిన్ను సిగరెట్ తాగమన్నది..?? అంటూ కయ్‌మన్నాడు సుధీర్..

ఫక్కున నవ్వారు కావ్య.. కావ్యతో తోడుగా వచ్చిన ఆమె ఫ్రెండ్..

‘ఇట్స్ ఓకే..! నేను బీకేసి బ్రాంచ్ నుండి వచ్చాను.. నా పేరు కావ్య.. బేసికల్లీ అయాం ఫ్రం సికింద్రాబాద్..’ పరిచయం చేసుకుంది కావ్య.

‘వావ్..! తెలుగా..? నేను వర్లీ బ్రాంచ్‌లోనే గత రెండేండ్లుగా ఉంటున్నాను.. అయాం ఫ్రం వరంగల్..’ అన్నాడు కార్తీక్..

ఆ పై వారిద్దరూ తెలుగులోనే కాసేపు మాట్లాడుకున్నారు..

×××

‘ఏమే..! ఈ మధ్య ఎందుకో కాస్త పరాగ్గా ఉంటున్నావ్..’ కావ్య వైపు సాలోచనగా చూస్తూ అడిగింది రజని..

‘పరాకు లేదు.. చిరాకు లేదు... మూసుకో..’ కసిరింది కావ్య.

‘కొంపదీసి కార్తీక్ తలపులలో వలపులు పూయించడం లేదు కదా..!’ నవ్వుతూ అంది రజని.

‘అదేం కాదు కానీ, కార్తీక్ మాటలు భలే ఉంటాయే..! ఎమోషన్స్ అంటాడు.. లవ్ అంటాడు.. హ్యూమన్ రిలేషన్స్ అంటాడు..

కాస్త వెరయిటీ పర్సనే..!’

‘అయితే పడ్డట్టేనా..?’

‘ఎక్కడా..?’

‘లవ్వులో..’

‘లవ్ మై ఫుట్..! కానీ, రోజుకొక్కసారైనా మాట్లాడకుంటే తోచడం లేదే..’ అంది కావ్య ఎటో చూస్తూ..

‘దాన్నే లవ్వంటారు మరి..! తప్పేముందిలే..! ఇద్దరూ తెలుగు వాళ్ళే కదా..!’ ఉత్సాహంగా అంది రజని

‘తేల్చుకోలేకపోతున్నానే..! బట్..! ఇంకొన్ని మీటింగ్‌ల తర్వాత ఏదో ఒక క్లారిటీ వస్తుందేమో..’ అంది కావ్య..

‘అంటే రెగ్యులర్‌గా మీటవుతున్నారన్న మాట..!’

‘యస్..! అయిదారు సార్లు..! ఓసారి పివిఆర్‌లో మూవీ కూడా చూశాం..’

‘అమ్మదొంగా..! అయితే ఏదో ఒక ఒపీనియన్ ఏర్పడింది కావొచ్చు కదా..!’

‘అతడు చాలా సెన్సిటివ్.. ఎమోషన్స్ ఎక్కువ.. చిన్న విషయానికే సంతోషంతో గంతులేస్తాడు.. యూ నో..?! నన్ను మీట్ అయిన

ప్రతిసారి ఖరీదైన గిఫ్ట్ ఇస్తుంటాడు.. పైగా ఖర్చంతా ఆయనే భరిస్తున్నాడు..’ అదోలా అంది కావ్య..

‘మంచిదేగా..! నీకే మిగులు..! ఇంతకీ ఎందాకా ఈ పయనం..? తీరం చేరే వరకా.. లేక జీవుడి బతుకు బజారేనా..?’ అడిగింది రజని.

కావ్య మాట్లాడలేదు..

‘అదేంటే.. అడిగితే చెప్పవేంటి..?’

‘వదిలెయ్..! ఈ సాయంత్రం ఆట్రియా మాల్‌లో షాపింగ్ చేసి, గజెబో లో డిన్నర్ చేసే ప్రోగ్రాం ఉంది.. నేను వెళ్తున్నా.. బై..’

అంటూ వెళ్ళిపోయింది కావ్య..

ఆమె వెళ్తున్న వైపే సాలోచనగా చూడసాగింది రజని..

×××

ఆదివారం..

దాదర్ నుండి కొలాబా వెళ్ళే మెట్రోలో కూర్చున్నారు కావ్య, కార్తీక్..

కావ్య చేతిని తన చేతిలో పట్టుకుని దాదాపు హత్తుకున్నట్టుగా కూర్చున్నాడు కార్తీక్. అండర్‌గ్రౌండ్ మెట్రోలో ఆదివారం కావడం

వల్ల ప్రయాణీకులు ఎక్కువగా లేరు. ఉన్నవాళ్ళెవరూ వీళ్ళిద్దరిని పట్టించుకోవడం లేదు.

ముంబైలో కిక్కిరిసిన రద్దీలో కానీ, ఇద్దరు ముగ్గురున్న చోట కానీ, ఎవరూ ఎవర్ని పట్టించుకోరు. ఎవరి పరుగు వారిదే..! ఎవరిపోరాటం వారిదే..! కానీ, పరుగు ఆగిన చోట మానవత్వం చిగురిస్తుంది. ముంబైలో ఆధ్యాత్మికత, సామాజిక బాధ్యత రెండూ ఎక్కువగా ఉంటాయన్నది మాత్రం నిజం..!

‘కావ్యా..! నువ్వు నా జీవితంలోకి రావడం నా అదృష్టం.. నడి సముద్రంలో నావ లాంటి నాకు తీరంలా దగ్గరయ్యావు.. యస్..!

అయాం లక్కీ..’ అన్నాడు కార్తీక్.. కావ్య చేతిని సున్నితంగా ఒత్తుతూ..

‘మి టూ..!’ అంది కావ్య.

అప్పటికి వాళ్ళిద్దరికి పరిచయం అయిదారు నెలలు కావొస్తుంది. ఈ ఆరు నెలల్లో లొనావ్లా, ఖండాలా లాంటి హిల్ స్టేషన్స్‌తో పాటు రిసార్ట్‌లు, హోటల్స్ అన్నీ చుట్టేశారు. లంచ్‌లు, డిన్నర్‌లు, షాపింగ్‌లు అన్నీ చేసేశారు. కావ్య కోసం ఖర్చుపెట్టే ప్రతి పైసా కార్తీక్‌కు ఎంతో సంతోషాన్ని కలిగించేది. ఖరీదైన గిఫ్ట్‌లు కొనిచ్చి తనలో తానే పొంగిపోయేవాడు..

తన గుండె గుడిలో కావ్యను ఓ ప్రేమ దేవతగా నిలుపుకున్నాడు కార్తీక్.

‘కావ్యా..! నెక్స్ట్ వీక్ నేను వరంగల్ వెళుతున్నాను. మా పేరెంట్స్‌కి మన విషయం చెబుతాను..’ అన్నాడు కార్తీక్..

చటుక్కున తలతిప్పి కార్తీక్ వైపు చూసింది కావ్య..

‘నువ్వు కూడా మీ పేరెంట్స్‌కి చెబుతావా..? నన్ను వచ్చి చెప్పమంటావా..?’ అడిగాడు కార్తీక్..

కావ్య ఏమీ మాట్లాడడం లేదు.. ఏదో ఆలోచిస్తున్నట్టుగా ఉంది..

కొలాబా స్టేషన్‌లో దిగి గేట్వే ఆఫ్ ఇండియా వైపు అడుగులేశారిద్దరూ..!

×××

వారం రోజులైంది..

కావ్య అందుబాటులోకి రావడం లేదు. కార్తీక్ ఆందోళనతో క్రుంగిపోసాగాడు.

ఫోన్ చేస్తే కనెక్ట్ కావడం లేదు. ఏం జరిగిందోనని కార్తీక్ భయపడసాగాడు. ఇన్ని నెలల పరిచయంలో కావ్య పనిచేస్తున్న

బీకేసిలోని ఆఫీస్ తప్ప, కావ్య ఎక్కడ ఉంటుందో, ఆమె చిరునామా ఎక్కడో కార్తీక్ కు తెలియదు..

ఇక ఉండలేకపోయాడు.. బైక్ తీసుకుని వర్లీ నుండి బీకేసిలోని కావ్య ఆఫీస్‌కు చేరుకున్నాడు.

వెయిటింగ్ హాల్‌లో కాసేపు కూర్చున్నాక, కెంటీన్‌కి వెళ్ళమని రిసెప్షనిస్ట్ చెప్పింది.

‘అదేంటి కావ్యా..! ఏమైంది నీకసలు..? వారం నుండి కనీసం ఫోన్ కూడా లేదు..! నేనెంత కంగారు పడిపోయానో తెలుసా..?’

ఆత్రంగా అన్నాడు కార్తీక్..

గట్టిగా నవ్వింది కావ్య. ఆ నవ్వు చిత్రంగా అనిపించింది కార్తీక్‌కు.

“చూడు కార్తీక్..! దీంట్లో మారడం, మారిపోవడం అనేదేది లేదు. అదంతే..! ఈ సోకాల్డ్ ప్రపంచంలో నేనే కాదు.. ఎవరైనా అంతే..! కొన్ని అవసరాలు.. కొన్ని అనివార్యాలు.. కొంతసేపు కలిసి ప్రయాణం..! ఇట్లాగే ఉంటాయి”

‘ఎందుకేంటి కంగారు..? నేనేం చిన్నపిల్లనా..? నువ్వేమైనా నా గార్డియన్‌వా..?’ కేర్‌లెస్‌గా అడిగింది కావ్య.

బిత్తరపోయాడు కార్తీక్..

‘అదేంటి కావ్యా..! నిన్ను చూడకుండా వారం రోజులు ఎలా ఉండగలనని అనుకున్నావ్..? ఫోన్ కూడా కనెక్ట్ కావడం లేదు..’

‘నేనే నీ నంబర్ బ్లాక్ చేశాను..’ అంది క్యాజువల్ గా నవ్వుతూ..

ఈ సారి మరింత బిత్తరపోయాడు కార్తీక్..

‘అదే.. అదే ఎందుకని..?’ ఆయన గొంతు వణకసాగింది.

‘మరేం చేయను..? ఏదో సరదాగా కొన్ని రోజులు కలిసి గడుపుదామంటే, నువ్వేమో పేరెంట్స్, పెళ్ళి అంటూ పెద్దపెద్ద మాటలు

మాట్లాడుతున్నావ్.. అందుకని..!’

‘చాలా కృయల్‌గా మాట్లాడుతున్నావ్ కావ్యా..! మనం ప్రేమించుకున్నాం కదా..! పెళ్ళి చేసుకుంటే తప్పేముంది..?’

‘తప్పేం లేదు.. నువ్వు పెళ్ళి చేసుకో.. ఎవరొద్దన్నారు..? ఇహ మన ప్రేమ అంటావా..? నేనెప్పుడైనా నిన్ను ప్రేమిస్తున్నాని

చెప్పానా..? పెళ్ళి చేసుకుందామని అడిగానా..? నువ్వే ఏదేదో ఊహించుకుంటే నేనేం చేయను..?’ ఈజీగా అంది కావ్య.

కార్తీక్ గుండె వేగం పెరిగిపోయింది. కళ్ళ ముందు చీకటి పరదాలు కమ్ముకున్నాయి.. చెమటలు పట్టసాగాయి.. అంటే తాను కావ్య గురించి కన్న కలలన్నీ అబద్ధమా..? కావ్య మనసులో తాను లేడా..?

‘లేవు.. నువ్వు నా మనసులో ఏ మాత్రం లేవు.. ప్రాక్టికాలిటీకి దరిదాపుల్లో కూడా లేని నీ మాటలు నాకు నవ్వు తెప్పించేవి.. నువ్వు నీ కలల ప్రపంచంలో ఉంటూ వాస్తవ లోకం ఎలా ఉందో గ్రహించలేకపోయావు.. అది నీ అమాయకత్వమే తప్ప నా తప్పేమీ

లేదు..’

‘మరి నాతో కలిసి ఎందుకు తిరిగావు..?’

‘మళ్ళీ అదే ఇన్నోసెంట్ క్వశ్చన్..! కలిసి తిరగడమేంటి..? టైం పాస్ కోసం కొందరు పుస్తకాలు చదువుతారు.. కొందరు

మూవీకి వెళతారు.. మరి కొందరు పబ్‌కి వెళతారు... ఇదీ అంతే..! నీ భ్రమైక లోకపు కలల ప్రపంచం నాకు నచ్చింది. నీతో టైం పాస్ చేయాలనుకున్నాను.. చేశాను. ఆ మాత్రం దానికే ప్రేమా, పెళ్ళీ అంటూ పెద్ద పెద్ద డెకొరేషన్స్ చేస్తే ఎలా..?’ వ్యంగంగా అన్నది కావ్య..

‘నో.. నో... కావ్యా..! నువ్వు జోక్ చేస్తున్నావు కదూ..!’

‘అయ్యా..! మహానుభావా..! నువ్వు... నీ ప్రవర్తనే పెద్ద జోక్..! ఈ జనరేషన్‌లో ఎమోషన్స్, రిలేషన్స్ అంటూ పట్టుకుని ఎవరు కూర్చుంటారు చెప్పు..! నీలాంటి ఫూల్స్ తప్ప..! సో..! ఫర్గెట్ ఎవ్రీ థింగ్ అండ్ గో అహెడ్..! కాస్త ప్రాక్టికల్‌గా మారు.. సంతోషంగా ఉంటావు.. లేకుంటే దేవదాసుగా మారిపోవడం ఖాయం..’ నిష్కర్షగా అంది కావ్య..

‘నువ్విలా మారతావని నేననుకోలేదు..’ దాదాపు ఏడుస్తున్నట్లుగా అన్నాడు కార్తీక్.

‘చూడు కార్తీక్..! దీంట్లో మారడం, మారిపోవడం అనేదేది లేదు. అదంతే..! ఈ సోకాల్డ్ ప్రపంచంలో నేనే కాదు.. ఎవరైనా

అంతే..! కొన్ని అవసరాలు.. కొన్ని అనివార్యాలు.. కొంతసేపు కలిసి ప్రయాణం..! ఇట్లాగే ఉంటాయి.. నువ్వో ఎమోషనల్ ఫూల్‌వి.

అందుకే బాధపడుతున్నావ్.. టేకిట్ ఈజీ..! ఇంతటితో వదిలెయ్..! ఎవరైనా అమ్మాయి ఒప్పుకుంటే పెళ్ళి చేసుకొని హాయిగా ఉండు.. లేదంటే ... ఒంటరిగా ఉంటూ ఎంజాయ్ చెయ్..! నీ ఇష్టం..! పద రజని.. వెళదాం.. బై కార్తీక్.. ఆల్ ది బెస్ట్..’ చేయి ఊపుతూఆఫీస్‌లోకి వెళ్ళిపోయింది కావ్య.

ఒంటరిగా మిగిలిపోయాడు కార్తీక్..

కేంటీన్ ఎవరో సౌత్ ఇండియన్ రన్ చేస్తున్నట్టున్నాడు.. తలూపుకుంటూ ఆ పాటను హమ్ చేస్తున్నాడు..

‘ఆడ నెమలి ఆటలకు గంగరాజు.. మొగనెమలి మోస పాయే గంగరాజు..’ కనకవ్వ పాట సన్నగా మ్రోగుతోంది కార్తీక్ ను వెక్కిరిస్తున్నట్టుగా..!



– డా.తాటి నరహరి,
93224 00551

---

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1697వ రోజు ‘ఓటీపీ’ అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. ‘ఓటీపీ’ అంశంపై వచ్చిన కొన్ని కవితలను ‘నేటి నిజం’ పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.



**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం**

అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు,9441046839

## ఒకేసారి విలువ

వన్ టైం పాస్ వర్డ్
ఒకేసారి
ఒకే ఒక్కసారి
అలా వచ్చి ఇలా
పనిచేసుకుని పోయేది
తప్పిపోతే
ఇంకోసారి అవకాశం ఇస్తుంది
వాడుకుంటే పని విజయం
వాడకుంటే మటుమాయం!!.
రహస్య సమాచారం
బహిరంగం కాకుంటే సఫలం
లేకుంటే అంతా కకావికలం.
సమాచార పొదుపు పదం
ధనాన్ని రక్షించే ఆయుధం
ఎవరికైనా దొరికితే ఖాతా మాయం.
అబ్బో
దానిపట్ల జాగరూకత అవసరం
ఎవరైనా చెప్పావో బతుకు భారం
సాంకేతిక పరిణామం
సరిగ్గా వాడకుంటే ప్రమాదం
తెలుసుకుని మెలిగితే ప్రమోదం
ఆంతరంగిక వ్యవహారం
జర భద్రం!!.

-డా.చీదెళ్ళ సీతాలక్ష్మి

## డిజిటల్ శాసనం

ఒక్క క్షణం జీవించే
చిన్న సంఖ్యల శ్వాస నీవు
కాని నిన్ను నమ్మి
తలుపులు తెరుస్తాయి
బ్యాంకుల గుండెలు
మన డిజిటల్ లోకాల ద్వారాలు.
నీవు రాసిన అక్షరాలు
కవితలా చదవలేం,
కాని నిన్ను అర్థం చేసుకోకపోతే
జీవితమే “యాక్సెస్ డినైడ్”.
పది సెకన్ల వయసు
శాశ్వత భద్రత బాధ్యత
మన నిర్లక్ష్యం ఒక క్షణమైతే
మన నష్టం యుగాలపాటు.
అమ్మ ప్రేమలా
నీవు కనిపించవు
మిత్రుడి మాటలా వినిపించవు
కానీ
నీ మౌనంలోనే
మన ఆస్తుల భద్రత నిద్రపోతుంది.
“ఎవరికీ చెప్పవద్దు”
అన్న ఒకే ఒక్క నీతి వాక్యం
నిన్ను కాపాడితే
మనల్ని మనమే కాపాడుకున్నట్లే.
అపరిచిత చేతులకు నీవు చేరితే
విశ్వాసం మోసం అవుతుంది,
మన నిర్లక్ష్యం చేత
మనమే మన శత్రువులమవుతాం.
ఓటీపీ?
నీవు కవితలా కాకపోయినా
కవితకన్నా గొప్ప సందేశం నీవు
జాగ్రత్తే నిజమైన భద్రత
అని గుర్తుచేసే
డిజిటల్ యుగపు ధర్మశాసనం.
ఒక్క క్షణం జీవించి
జీవితాన్ని కాపాడే
ఓ చిన్న సంఖ్యల
మహాకావ్యం నీవు.
నిన్ను అర్థం చేసుకోకపోతే
జీవితమే “యాక్సెస్ డినైడ్”.

-గుండవరం కొండల్ రావు

## నమ్మకాల సైనికుడివి

ఓహ్వాయ్ అంటే ఓహ్వాయ్ అనే
తోడు నేస్తానివి
అలావచ్చి ఇలా మాయమైనా
నీ భూమిక పోషిస్తావు.
నీవు తోడుంటే గుండె ధైర్యం
నీ అండ ఉంటే సురక్షితం
డిజిటల్ మయ
మోహిత ప్రపంచంలో
నీవొక చక్రధారివి.
నేస్తంలా తోడుంటావు
కవచంలా కాపాడుతావు
చుట్టంలా అప్పుడప్పుడొచ్చినా
ఆపత్కాల బాంధవుడివి.
చెమట చుక్కలు చిందించలేని
చవట దద్దమ్మల చెరనుండి
మోసపు వలల నుండి
మా సొమ్ములు రక్షించే
నమ్మకాల సైనికుడివి.
రెక్కల కష్టానికి
ఒక్కలు రాకుండా
జాగ్రత్తల దడి కట్టి
దాపుగా నిలిచే
కాపలాదారుడివి నీవు.

-నగునూరి రాజన్న

## మోసగాళ్ళకు బుద్ధి చెప్పు

ఒక్కసారి పుడుతుంది
ఒక్కసారే పలుకుతుంది
నమ్మకానికి నిలువెత్తు సాక్ష్యం
ఓ.టి.పి.
బ్యాంకు తలుపులు తెరిచేది నువ్వే
మొబైల్ లో నిద్రలేపేది నువ్వే
డిజిటల్ లోకంలో
భద్రతకు కాపలాదారి నువ్వే
అమ్మ చేతి తాళంచెవిలా
నాన్న నమ్మకం మాటలా
ఖాతాను గుండెల్లో
జాగ్రత్తగా దాచే గడియ నువ్వు.
నాలుగు సంఖ్యలు
లేదా ఆరు అక్షరాలు
వాటిలో దాగుంది
మన శ్రమ మన సంపాదన
మన భవిష్యత్తు
చెప్పొద్దు ఎవరికి అని
మౌనంగా చెబుతావు,
“ఇది నీది మాత్రమే” అని
మనసుకు గుర్తు చేస్తావు
మోసం చేసే చేతులను
దూరం నెట్టే బలం నువ్వు
అజ్ఞాత ప్రమాదాల నుంచి
కాపాడే కవచం నువ్వు.
సెకన్లలో పుట్టి
నిమిషాల్లో మాయం
కానీ
మా జీవితాల్లో
విలువైన పాత్ర నీది
ఓ.టి.పి. ఓ చిన్న వీరుడా
డిజిటల్ యుగపు రక్షకుడా
నీవు ఉన్నంత కాలం
మా భద్రతకు ఢోకా లేదు.
చిన్నదైనా నీ పని గొప్పది
నిశ్శబ్దమైనా నీ పాత్ర పెద్దది
నేటి ప్రపంచంలో
నమ్మకానికి నీవే గుర్తు.

-వి. సంధ్యారాణి


## మంత్రం..తంత్రం..!

ఓ యాప్ ఓపెన్ చేయాలన్నా
బ్యాంకు ఎకౌంటు తెరవాలన్నా
ఓ టి పి లాకర్ లా పనిచేస్తుంది
నమ్మకాన్ని వమ్ము చేయకుండా.
డిజిటల్ లోకంలో ప్రత్యేకం
మోసాలకు చెక్
దొంగలకు దొరకనిది
అమ్మ చేతిలో దాచిన తాళమిది.
సెల్ ఫోన్ కి రక్షకంకణం
పహరా కాస్తుంది
ఓటీపీ నెంబర్ తో
ఎరిక లేక ఎవ్వరికైనా
గరికతో అయిందంటే
హాక్ అయిపోతుంది క్షణంలో
మాయాజాలంలో పడిపోతుంది
సెల్లుకి చిల్లు పడుతుంది దగాతో.
అండగా నిలబడుతుంది
దండిగా ధైర్యాన్నిస్తుంది
మొండిగా వ్యవహరిస్తే
చర్యలు తప్పవంటుంది
ఓటీపీ రహస్యం
బట్టబయలయిందంటే
చిల్లిగవ్వైనా మిగలని శూన్యంలో
చేతులెత్తేసిన
యాంత్రిక మాయాజాలం.

-పి.పద్మావతి

# అనుభవాల అక్షరీకరణ "వెలుగుల వెనుక" కథలు

కార్మిక నేతగా పలు ప్రజా ఉద్యమాలలో చురుకుగా పాల్గొనడమే కాకుండా,వివిధ ప్రక్రియల్లో రచనలు చేస్తున్న వేల్పుల నారాయణ పాత్రికేయులు, కాలమిస్టు, సినీ గేయ రచయిత, అభ్యుదయ కవి, కథా రచయిత,రచించిన 15 కథల సమాహారం **"వెలుగుల వెనుక"**. గతంలో నవలాకారుడిగా నవలలు, అభ్యుదయ కవిగా కవితా సంపుటులు, వ్యాసకర్తగా వ్యాస సంపుటిలను ప్రచురించిన వేల్పుల నారాయణ వెలువరించిన తొలి కథా సంపుటి ఇది.






ప్రతులకు: వేల్పుల నారాయణ 9440433475

మూడు దశాబ్దాలపైగా సింగరేణి బొగ్గు గనులలో ఉద్యోగంచేసి ప్రస్తుతం విశ్రాంత జీవనం గడుపుతున్న వేల్పుల నారాయణ తను పనిచేసిన గనులలోని పని ప్రదేశాలు, కార్మికులు, కాలనీ ఏరియాలో కార్మిక కుటుంబాలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలు, ఈ కథల్లో మనకు గోచరిస్తాయి. బొగ్గు ఉత్పత్తి లో ప్రతినిత్యం ప్రకృతికి విరుద్ధంగా ప్రాణాలకు తెగించి మృత్యువు తో పోరాడే యుద్ధ సైనికుల్లాంటి గని కార్మికుల జీవన నేపథ్యాన్ని బయటి ప్రపంచానికి, ఇవీ వారి కథలు అని చేసినట్లుగా ఈ కథలు మనకు తెలియపరుస్తాయి. భారతీయ కథా సాహిత్యం లో కార్మిక వర్గ జీవితాలను, పని ప్రదేశాల పరిస్థితులను, హక్కుల కోసం జరిగిన కార్మిక పోరాటగాథలను, చరిత్ర పుటల మధ్యన మౌనంగా మగ్గిపోయిన అనేక గాథలు కార్మిక కథలుగా ఆవిష్కృతమైన అనేక సంఘటనల రూపం ఈ **"వెలుగుల వెనుక"**

బొగ్గు గనుల వ్యవస్థ లోని లోపాలను, యాజమాన్యం, కార్మికుల మధ్య సంబంధాలు మృగ్యమై ఉత్పత్తి కోణంలో మాత్రమే చూసినప్పుడు అవస్థల పాలైన చెమట చుక్కల సాక్ష్యాలను, శ్రమజీవుల ప్రాణ త్యాగాలను, హక్కుల సాధన కోసం చేసే సమ్మెలు, గని కార్మికుల సంఘటిత ఉద్యమాలతో కూడిన చైతన్య పాత్రలను వీరి కథల్లో మనం చూస్తాము."వెలుగుల వెనుక" సంపుటి లోని కథలన్నీ గతంలో అభ్యుదయ, విశాలాంధ్ర, ఆహ్వానం, నవ తెలంగాణ, వంటి పత్రికలలో అచ్చయినవే. ఉద్యమ కెరటం వంటి పెద్ద కథ తో పాటు వాన చినుకులు వంటి చిన్న కథలు ఈ సంపుటిలో ఉన్నాయి.

**భారతీయ కథా సాహిత్యం లో కార్మిక వర్గ జీవితాలను, పని ప్రదేశాల పరిస్థితులను, హక్కుల కోసం జరిగిన కార్మిక పోరాటగాథలను, చరిత్ర పుటల మధ్యన మౌనంగా మగ్గిపోయిన అనేక గాథలు కార్మిక కథలుగా ఆవిష్కృతమైన అనేక సంఘటనల రూపం ఈ "వెలుగుల వెనుక"**

బలమైన కథా కథన పద్ధతి, కవితాత్మక శైలి, స్థల కాల స్పష్టత, స్పష్టమైన ఇతివృత్తం, వాస్తవ తత్వం, సందేశాత్మకత, సరళమైన భాష, జీవవంతమైన పాత్రల సృష్టి, నారాయణ గారి కథల్లో మనకు కనిపిస్తాయి. ఈ కథలు కేవలం సంఘటనల సమాహారం కాదు. అనుభవాల కలబోతై, ఆసాంతం చదివించే స్వరూపం కలవి. వీరి కథలలో తెలంగాణ పద సౌందర్యం, వాడుక పదాల గుబాళింపు కయి గట్టినట్లు ంటాయి.

కాలనీ ఏరియాలోని వాడల్లోని నీళ్ల పంపులలో నీళ్లు సరిగా రాక పడుతున్న ఇబ్బందులు, బొగ్గుబాయిలో జరిగిన ప్రమాదం తో ఆసుపత్రి పాలైన కార్మికుడు, దావఖానాలో డాక్టర్లు బాయి దొరలను ఒక తీరు, బొగ్గు ఉత్పత్తి కారకులైన కార్మికులని, వారి కుటుంబీకులను చూసే తీరు పట్ల అగ్రహోదగ్రుడైన రాజన్న పాత్ర ద్వారా అగ్గి రాజు కున్నదనే శీర్షిక కథకు చక్కగా సరిపోయింది. బాయి మీద దొరలను ఎదిరించలేరు కానీ ఇంట్లో పెళ్ళాల మీద అరవడానికి మాత్రం నోరు లేస్తుందనే ఆసహాయత చివరకు కాలనీ వీధిలో పందుల స్వైర విహారంతో గాయాలపాలైన భార్యకి చికిత్స అందించే విషయంలో డాక్టర్ చూపిన అలసత్వం పట్ల అగ్రహోదగ్రు డైన తీరు.. అప్పటిదాకా కార్మిక వర్గం లో నెలకొన్న అసహనానికి ప్రతీకగా... సహనానికీ ఒక హద్దు ఉంటుందన్న తీవ్రతను హెచ్చరిక ను దృశ్యమానం చేసిన కథ **"అగ్గిరాజుకుంటుంది"**

కటిక చీకటి కరాళ నృత్యం చేసే బొగ్గు బావిలోని పనిప్రదేశాలను రచయిత కథలో వర్ణించిన తీరు పాఠకుడికి కళ్ళకు కట్టినట్లు కనబడుతుంది. మృత్యు కుహారం కథలో, సూర్యుడు చూడని ప్రదేశం, వెలుతురు సోకని సొరంగం గాలి ఆడని గర్మి ఫేసు అంటూ దారుణమైన పని ప్రదేశాల్లో కోల్ కట్టర్ గని కార్మికుల దయనీయ స్థితిని ఈ కథలో తేట తెల్లం చేస్తారు. శ్వాస తీసుకోవడానికి స్వచ్ఛ మైన గాలి లభించని ప్రదేశాల పరిస్థితి లో బ్లాస్టింగ్ జరిగే తీరుతో భరించరాని వేడిలో కార్మికులు ఆ క్షణం ఉక్కిరి బిక్కిరి అయ్యే స్థితిని కళ్ళకు కట్టినట్లు కథలో వర్ణించారు. బాడ్ రూఫ్ కింద జరిగిన గని ప్రమాదంలో గాయాల పాలైన కార్మికుల దీనస్థితిని కథగా మలచిన తీరు పాఠకులను కదిలిస్తుంది.

విద్యార్థి దశ నుంచే అన్యాయాన్ని సహించక, ఎంతటివారినైనా ఎదిరించి నిలదీసే మనస్తత్వం గల పాత్రలో రవి, దొరల కుటుంబంలో జన్మించినా దొరతనం చెలాయించే వాసనలు గిట్టని, తమ ఇంట్లో పనిచేసే పాలేర్ల మీద దయ, జాలి, ఆప్యాయత కురిపించే మనసున్న మనిషి పాత్రలో సుగుణ లను పరిచయం చేసే కథ"ఉద్యమకెరటం".విద్యార్థి ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్న రవిపై అభిమానం పెంచుకొని రవి మనసుకు చేరువైన సందర్భం పొడగిట్టని సుగుణ సోదరుల చేతిలో అవమానించబడటం.. అదిచూసి సుగు ణ తట్టుకోలేక పోవడం కథలో షరా మామూలే. కొన్ని పరిస్థితుల నేపథ్యంలో రవి అండర్గ్రౌండ్ కార్యకలాపాల లోకి వెళ్లిపోగా సుగుణ డాక్టర్ వృత్తిలో కొనసా గింది. దొర కుటుంబ దాష్టీకాలకు ఎదురుచెప్పేటోల్లకు పోలీసుల సహకా రంతో అణచివేత,వార్నింగులతో పల్లెలు అల్లకల్లోలం అయిన పరిస్థితులను రచయిత దృశ్యమానం చేసిన తీరు హృ ద్యంగా ఉంది. ఊళ్లో అల్లర్లు సద్దుమ ణిగిందని పోలీసు క్యాంపు ఎత్తివేసిన తరువాత ఘట్టాన్ని రచయిత ఆసక్తికరం గా మలిచారు. దొరతనం పోయి పొలా లు, జాగల్ని అగ్గువ ధరకే అమ్ముకున్నా వచ్చిన సొమ్ముతో దొర పట్నంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం, బ్యాంకు లోనుతో పరిశ్రమలుపెట్టి వ్యాపారవేత్తగా మారిన తీరు కథలో ట్విస్ట్. ఉద్యమంలో నేలకొ రిగిన రవి ఊరిలో విగ్ర హమై జేజేలు అందుకుంటే భగ్న ప్రేమికురాలు సుగు ణ తల్లిదండ్రుల, సోదరుల ఒత్తిడితో బల వంతపు పెళ్ళిచేసుకున్నా చివ రకు అతని నుండి ఎలావిముక్తి లభించిందో కథలో ఆసక్తికరంగా మలిచారు రచయిత.

బొగ్గు గని కార్మికుడు రాజయ్య కు బొగ్గు బావిలో పని సమయం లో కంట్లో బొగ్గు పెల్ల పడి కంటి నొప్పితో బాధ పడుతున్న వేళ... కంపెనీ ఆసుపత్రి లో కంటి వైద్యుడి నిర్లక్ష్యం కారణంగా జరిగిన నష్టం... ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్ళేలోగా ఇన్ఫెక్షన్ ఏర్పడి కంటి చూపుకే ప్రమాదం జరిగిన వేళ కార్మికులు ఆగ్రహం తో చేపట్టిన సమ్మె... అనవసర పంతాలకు పోయి యాజమాన్యం దిగిరాని కారణంగా సమ్మె కొనసాగిన పరిస్థితులకు అద్దం పట్టిన కథ **"సమ్మె"**.

అధికారి కామవాంఛకు బలైన ఆ ఇంట్లోని అందమైన పనిమనిషి చివరకు న్యాయం జరగక పోగా పోలీసులు అమాయకంగా మరొక వాచ్ మెన్ ను ఇరికించిన తీరు, భర్తయే దోషి అని తెలి ఆ అధికారి భార్య పోలీసులకు కంప్లైంట్చేసినప్పటికి, చివరకు భర్త బెదిరింపులకు భయపడి అమాయ కురాలికి న్యాయం చేయలేక నిస్సహాయ తతో ఓడిపోయినకథ "చీకటి కదుపులో".

గని కార్మికులు పనిలో అలసి సొలసి ఇంటికి వచ్చి తమ శ్రమను మరచిపో వడానికి అలవాటుచేసుకునే మద్యం,వాడ వాడనా వెలిసిన మందు షాపులు... క్రమేపీ దానికి బానిసలుగా మారి తుదకు వారి జీవితాలను ఎలా విధ్వంసం చేస్తున్నదో తెలిపే కథ **"విధ్వంసం"**.

"వాన చినుకులు"కథ మానవత్వం ఇంకా కొందరు మనుషుల్లో ఉ ందని చాటి చెప్పే కథ. రోడ్డు ప్రమాదానికి గురై రక్తపుమడుగు లో విలవిల లాడుతున్న ఓ వ్యక్తిని చూసి చలించిన మానవత్వం గల మనిషి సకాలంలో ఆ గాయాలపాలైన మనిషిని ఆసుపత్రికి తీసుకుని వెళ్ళడానికి తనకు మరొకరి సాయం కోసం పడిన తిప్పలు,తనకు ఎదురైన వ్యక్తుల మనస్తత్వా లు చివరకు సాయం చేయడానికి ట్రాక్టర్ లేబర్ లు ముందుకు రావడం తో కథ సుఖాంతమవుతుంది.

మానవత్వం మంచితనం అనేవి మృగ్య మై, మతం పేరుతో మారణహోమాలను సృష్టిస్తున్న మూకల నుండి ఒక నిరుద్యోగ యువకున్ని దేవతలా రక్షించిన ఓ యువతి చివరకు ఆ వ్యక్తికి తన సామాజికో ద్యమంలో భాగస్వామిగా ఉద్యోగం కల్పించి ఆదరించిన కథ **"దేవాల యం"**. పాత్రోచిత సంభాషణలు, కథలో రచయిత వైఖరిని, దృక్పథాన్ని వెల్లడిస్తుంది.

కార్మిక కథలతో పాటు ఈ సంపుటిలో మరిన్ని కథలు చేర్చడం వల్ల విభిన్న కథల సమాహారంగా అందించడం లో రచయిత జాగ్రత్త పడ్డారు.

చివరి కథ **"నల్ల బంగారం నగిషీల వెనుక"** కూడా బొగ్గు గనిలో యాజమాన్యం మొండిగా వ్యవహరించి పని ప్రదేశాల్లో భద్రత గురించి శ్రద్ధ పెట్టక, కార్మికుల నిరసనను కూడా పట్టించుకోక, ఉత్పత్తి పైనే దృష్టిపెట్టి కార్మికులచే పనిచేయిస్తే జరిగిన ప్రమాదం కార్మికుని ప్రాణం బలి తీసుకున్న ఘటనని రచయిత ఈ కథలో కళ్ళకు కట్టి నట్లు దృశ్యమానం చేశారు. పని ప్రదేశాల్లో కార్మికులు నిత్య వాడుకునే వ్యవహారికాన్నే రచయిత ఈకథలో సమృద్ధిగా వినియో గించి కథకు నిండు దనాన్ని కూర్చడం అభినందనీయం. "బలి" కథ కూడా ఉత్పత్తి కోసం అధికారుల ఒత్తిడి, రక్షణ కరువైన ఉపరితల బొగ్గుగని లో వర్షాకాలం లో ఎదురయ్యే ఆమస్యలు, మహిళా కార్మికుల వెతలను స్పృశించిన కథ.

రచయిత గని కార్మిక సమస్యలను, పని ప్రదేశాలను, వివిధ వృత్తుల పనితీ రును ఆయా కథలలో వివరణాత్మాకంగా అక్షరీకరించిన తీరు పాఠకులకు చక్కగా అర్థమవుతుంది. ఈవిషయంలో కథకుడు కనబరచిన శ్రద్ధ అభినందనీయం. కార్మిక కథలతో పాటు ఈ సంపుటిలో మరిన్ని కథలు చేర్చడం వల్ల విభిన్న కథల సమాహా రంగా అందిం చడం లో రచయిత జాగ్రత్త పడ్డారు.

రచ యిత కలం నుండి మరిన్ని మంచి కథలను ముమ్ముందు ఆశిద్దాం.

నవచేతన ప్రచురణ సంస్థ వారు అందించిన ఈ కథల సంపుటి కొని చదవదగిన గ్రంథం.



–శ్రీదాస్యం లక్ష్మయ్య,
9440155240

## విరాజిల్లుతుంది

అన్ని జన్మలలో ఉత్తమమైనది
మానవజన్మ.,....
అందుకే నలుగురికీ ఉపయోగపడేలా
ఉన్నతంగా జీవించాలి ....
పరోపకారం చేయడమే
కర్తవ్యముగా భావించాలి....
గౌరవమర్యాదలనుఇచ్చిపుచ్చుకొనే
అభిలాష ఉండాలి....
కామక్రోధలోభ మోహామద
మాత్సర్యాలకు తావివ్వక....
సహృదయంతో నిన్ను నడిపించే
ఒక మహత్తర శక్తి ఉందని నమ్మి....
కర్మసాక్షి చేసే కార్యాలన్ని
గమనిస్తుంటాడని గ్రహించి....
మనస్ఫూర్తిగా మంచి మాత్రమే
చేయగలిగితే
చక్కని ఫలితం వస్తుంది....
కల్లాకపటం మోసంద్వేషంలేని
జీవితమే మధురం
కుటుంబమంతా ఐకమత్యంగా
సుఖం సంతోషాలతో ఉంటేనే
సుందరం...
ఒకరికొకరు సహకరిస్తు లోపాలను
సవరించుకుంటూ ఉన్నచో సౌఖ్యం ....
అప్పుడే నందనవనం లోని అందమైన
పూల పరిమళం లా...
కళకళ తళతళలాడుచు
సాగే స్వచ్ఛమైన గంగా నదిలా...
విశాలమైన గగనఃలో విరిసే
సప్తవర్ణాల హరివిల్లులా....
భవిష్యత్తు ఆనందమయమై
ఆదర్శవంతమై విరాజిల్లుతుంది

–ఎం. ఎ. ఉమారాణి
95814 78722



**కవితార్చన**

అడ్మిన్: డా॥రాధాకుసుమ
సెల్:99892 41319

"కుసుమ ధర్మన్న కళా పీఠం" సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది. అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..

## జీవనం

బతుకు పోరాటంలో
ఎన్నెన్నో ప్రయాసలు
జీవన పయనం
ఓ సాగరం వంటిదైతే
అలుపెరుగని పోరాటంలో
కనీసఅవసారలకై సాగే
గూడు గుడ్డ తిండి ఏ జీవికైనా
వెతుకులాట లో రకరకాల
పనులు అందులో తమ బతుకు చిత్రంలో
సృష్టించుకున్న విద్యలెన్నో
ఆ విద్యలన్నీ జానెడు పొట్ట ఆకలికైతే
కొన్ని సంసార నావను ఈదటానికి
మనస్సు ఉంటే మార్గం ఉంటుంది అనే
చందాన
మనస్సు కు నచ్చినది కాకపోయినా
జీతభత్యాలు
అరాకొరైనా భారమైన బాధ్యత గా తనను
నమ్ముకున్న వారి ఆకలిని తీర్చేందుకు
కోటివిద్యలు కూటి కొరకే అనే చందాన
నానా పనులను అలుపెరుగక
అలసట లేక జీవనం సాగించే
సగటు మనిషి జీవన పయనం .. రేపటి
కోసం ఆరాటమే తప్ప ఆదుకునే హస్తం
వైపు చూడని వైనం

–గాయత్రి చిరుమామిళ, 81212 80797

## పేదరికం

పేదరికం పాట్లు?
అగచాట్లు అన్నిన్ని కాదు
నకనకలాడే ఆకలి,
చిరిగిపోయిన బట్టలు,
ఆవిరైన ఆశలు?
భూలోక నరకం,పేదరికం
స్వాతంత్ర్యం వచ్చి ఇంతకాలమైనా
ఇంకా ప్రజలు పేదరికంతో
ఆకలి మంటలతో
అల్లలాడుతున్నారు
చెత్తకుండీలలో పారేసిన
ఎంగిలిమెతుకులు
ఏరుకునే వాళ్ళెందరో
పిల్లను చంకనెత్తుకొని
ఆకలిమంటల తీర్చమని
చెయ్యిచాచే వాళ్ళెందరో.
స్వాతంత్ర్యం ఫలాలు
పేదలకు చేరటం లేదనిపిస్తోంది
రెక్కాడితేగానీ డొక్కాడని
బ్రతుకులెన్నో
పేదరికంతో రైతుల,
చేనేత కార్మికుల
ఆత్మహత్యలు కొనసాగుతునేఉన్నాయి
చుట్టూతా చీకటుందని
తిట్టుకుంటూ కూర్చోవటం కన్నా
చేతనైనంతలో చిరుదీపం
వెలిగించాలీ
ఉన్నదాంట్లో తాను తృప్తిగా బ్రతుకుతూ
చేతనైనంతలో పేదలకు
చేయూతనివ్వాలీ
ప్రజల,ప్రభుత్వ లక్ష్యమిదే కావాలీ.

–ఎం.వి.చంద్రశేఖరరావు
9989362703

## చైతన్యదీప్తి– సాహిత్యం

సమాజ హితంకోరి
జరిగే అన్యాయాలపై
సామాజిక చౌతన్యం
నింపేది సాహిత్యం!.
సామాన్యులకు
ఇరుప్రక్కలా
బాసటగా నిల్చేది
సాహిత్యం !.
ప్రజలలో చైతన్యం
ప్రజ్వలింపజేసి
సమరశంఖం
పూరించేది సాహిత్యం!.
అన్యాయాలను
అధర్మాలనూ
అక్షరమై
ఎదిరించేది సాహిత్యం!
మనసున పేరుకున్న
దిగులు మేఘాలను
పతాపంచలు చేసి
ఆనందాన్ని ఆహ్లాదాన్ని
అందజేయడం
సాహిత్యం విధి !!.
ప్రజల పక్షపాతిగా
ప్రజాక్షేమం కోరి
ప్రజల గొంతుకై
నినదించేది సాహిత్యం!!.
ప్రభుత్వాలకు
ప్రజలకూ
అనుసంధానకర్తగా
పెద్దన్నపాత్ర వహించి
వారధిగా నిలిచేది సాహిత్యం !!

–బి.వి.వి.సత్యనారాయణ
9912233739

## యువతజీవనం

పల్లె జీవనం ఆరోగ్యవంతం...
ఎటుచూచిన ఆహ్లాదం...
ఎగురుతున్న విహంగాలు, నల్లని మబ్బులు...
ఆప్యాయతల నడుమ పయనం..
పట్టణ వాతావరణం రణగొణ ధ్వనుల మధ్య
సంగీతం విన్నట్లు...
కాలుష్య వాయువులను పీల్చవలేక ముక్కుకు కవచం..
కుటుంబ సమేతంగా పయనం...
పట్టణ జీవనం కనికట్టు చేస్తున్నట్లు..
ఆహ్వానం పలుకుతున్న కృత్రిమమైన
అందం లాంటి వాతావరణం...
మేడిపండు అందం...
ఎప్పటినుంచో మాయాలోక విహంగంలా ...
ఆధునికత ముసుగులో కనిపించని...
అష్టావక్రుని రూపంలా నగర జీవనం..
ఇద్దరు సంపాదిస్తున్నామని ఆనందం..
అద్దె ఇల్లు జీవనాలు..
ఆకలేస్తే రుచికరమైన
ఆరోగ్య కరభోజనం వండే ఓపిక లేక..
భోజనశాలల వైపు పరుగులు...
వేలు వేలు పెట్టి అనారోగ్య ఆహారాన్ని నింపి...
వినోదాలకు రకరకాల కార్యక్రమాలు...
ఆరోగ్యాల కొరకు పార్కుల్లో పరుగులు...
పిల్లల చదువులకు లక్షలు..
అప్పులు చేయడానికి అయినా తిప్పలు..
అమ్మానాన్నలను పల్లెల్లో దూరంగా ఉంచడానికి సిద్ధం.
ఇదే నేటి యువత జీవనం.

– వేము విజయ్ కుమార్
9491340431.

**పుస్తక సమీక్షలు**

# సత్సాంప్రదాయాలు, వాటి ఔన్నత్యం

64 కళల్లో ఏ ఒక్క కళలో ప్రావీణ్యత సాధించినా, మిగతా కళలన్నీ సునాయాసంగా అబ్బుతాయంటారు. కూచిపూడి నృత్య కళాకారిణి శ్రీమతి ఉషాగాయత్రిగారిని గమనించితే ఇది నిజమేనని అభిప్రాయం కలుగుతుంది. సాహిత్యం సాంస్కృతిక రంగాలలో కూడా మంచి పేరు తెచ్చుకున్న వీరి **"అమ్మమ్మగారి కాశీయాత్ర"** కథా సంపుటిలో 27 కథలున్నాయి. చక్కని ఇతివృత్తం, శైలితో సాగే ఈ కథలు రచయిత్రికి కథా సాహిత్యంపై మంచి పట్టు ఉండటమే కాకుండా చదువరిని ఆకట్టుకోగలిగిన కళ' ఉంది. నిస్సహాయుడై, వయసుపైబడిన తండ్రి, సవితి తల్లి, మధ్యనలిగే కూతురు సౌశాల్యవతి అయిన సుశీల మధ్యనడుస్తుంది. 'నూతన బంధం' కథ. తండ్రి మాటకు తలవంచి సీతారామ్ అనే భార్యగతించిన పిల్లలు కల తండ్రి ఇంటికి **'ప్రొబేషన్'** వెళ్తుంది. తన మంచి నడతతో పిల్లలకు దగ్గరవుతుంది. ఆమే సపర్యలకు ముగ్ధుడైన సీతారాం ఆమెనో కూతురిగా భావించి చక్కని సంబంధం తేవటానికి నిశ్చయించటంతో కథ ముగుస్తుంది. ఉద్యోగాల్లో ప్రొబేషనరీ షిప్ ఉంటుంది కాని భార్య పోస్టుకు ప్రొబేషన్! సాంప్రదాయ వాదులకు మింగుడు పడని మలుపు. అయినా కథ చదువుతున్న పాఠకుడికి కథను రచయిత్రి మలిచిన తీరువల్ల 'ఎబ్బెట్టు' అనిపించదు.




ప్రతులకు:డా॥మద్దాళి ఉషాగాయత్రి, ఫ్లాట్ నెం. 101 & 102 మద్దాళి గోల్డెన్ నెస్ట్, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్–500013.



ఇక్కడే రచయిత్రి మార్కులు కొట్టేస్తారు. ఇంతటి సరళ స్వభావి అయిన సీతారామ్ సుశీలను భార్యగా చేసుకుంటాడా? అని కాసేపు పాఠకులను డొలాయమాన స్థితిలో ఉంచి మంచి ముగింపు ఇచ్చారు. **'కాగల కార్యాన్ని గంధర్వులే తీర్చారు'** అని ఒక సామెత. అన్నీ అనుకూలిస్తే దైవం కరుణిస్తే అనుకున్న పనులు అనాయాసంగా నెరవేరుతాయి. ఉషాగాయత్రిగారి ఈ కథల సంపుటిలో టైటిల్ కథ **"అమ్మమ్మ గారి కాశీయాత్ర"**లో అమ్మమ్మ అన్నపూర్ణమ్మగారికి కాశీయాత్ర చేసి ఆ కాశీ విశ్వేశ్వరుడి దర్శించుకుని తరించాలన్న కోరిక ఎన్నాళ్ళ నుంచో ఉంది. కొడుకు జగన్నాధానికి ఎన్నిసార్లు విన్నివిం చుకున్నా, ఉలకడు. పలకడు.

కొడుకుతో కుదరటం లేదని మనవడు కామేశంతో తన గోడు వెళ్ళబోసుకుంది. **'కాముడు'** అని ముద్దుగా పిలవబడే మనవడు కామేశం అమ్మమ్మగారి కోరికను తీరుస్తాడు. ఇన్నాళ్ళూ కొడుకూ కోడలు, కూతురు అల్లుడితో ఎంత మొరలిడుకున్నా నెరవేరని కోరిక మనవడి చొరవతో సంపూర్తి అవుతుంది. ఇక్కడ రచయిత్రి పాఠకులు ఊహించని మరో మలుపు త్రిప్పారు కథని.

అన్నపూర్ణమ్మ గారింట్లో వారాలు చేసుకుని చదువుకున్న విశ్వం అనే అబ్బాయి ఐ.ఏ.ఎస్ ఆఫీసరు అవుతాడు. అన్నపూర్ణమ్మకు కాశీ విశ్వేశ్వరుడిలా తారసపడి, కారు, కానిస్టేబుల్‌ను తోడుగా ఉంచి విశ్వేశ్వరుడికి అభిషేకం, విశాలాక్షి దర్శనం కాశీలోని ముఖ్యమైన గుళ్ళూ గోపురాలూ చూపించి, గంగ స్నానం చేయించి సాయం సంధ్యవేళ గంగమ్మ తల్లికిచ్చే హారతి చూపించి అన్నపూర్ణమ్మను తరింపచేస్తాడు.

ఈ అనుకోని ఆదరణతో అమ్మమ్మే కాకుండా, కూడా వచ్చిన కుటుంబ సభ్యు లందరూ, అమ్మమ్మ వల్ల యాత్ర సులువు అయినందుకు సంతోషిస్తారు. కథాంతాన "కథా సూత్రం" అన్న కంక్లూడింగ్‌పేరాలో.. మనతో ఉంటున్న పెద్దవాళ్ళ చిన్న చిన్న కోరికలను చిన్న బుచ్చకూడదు అంటూ రచయిత్రి వివరించటం బావుంది.

కథను, కథలా ముగించకుండా, కథలోని నీతిని, ముఖ్యోద్దేశాన్ని రచయిత్రి వివరించటం, గోరుముద్దలా.. ముద్దుగా ఉండటం విశేషం!

జీవితం ఎవరిపట్లా వడ్డించిన విస్తరి కాదు. విఫలమైన ప్రేమ వివాహపు స్నేహంపట్ల అది మరీను. ఒంటరి బ్రతుకు.

చిన్నారి శ్వేతకు జ్వరం. అమ్మా అమ్మా అంటూ శ్వేత మూలుగు. రెండు గంటల రాత్రి. ఎదుటి ఫ్లాట్‌లో చున్నీతో ఉరివేసుకున్న అమ్మాయి. ఇవన్నీ ఒక పార్శ్వం. పై ఫ్లోర్‌ఫ్లాటులో వృద్ధ దంపతుల పరస్పరానురాగం. ఇవన్నీ అనుభవిస్తోన్న స్నేహ విడిపోయిన **'తోడు'** ను తిరిగి కోరుకోవటం.. దాంపత్యంలోని జీవిత సత్యాన్ని **'అపార్టు మెంటు'** కథలో రచయిత్రి వివరించిన తీరు ప్రశంసనీయం. మంచీ చెడులను ప్రజెంటు చేస్తూ అన్యాపదేశంగా కాదు.

'డైరెక్టు'గానే భర్త మిత్రా 'కంపనీ' కోరుకోవటం విడిపోయిన భర్త సానుకూల స్పందన.. పాఠకులకు ఓ సత్సందేశం సుఖమయ సమాజం ఎట్లా సమకూరేనో.

రచయిత్రి ఈ కథలో చెప్పారు. మూర్తీభవించిన మానవత్వపు సందేశాలు, సంపదను మించింది సంస్కారం అన్న వివరణ (ఓ తండ్రి తీర్పు కథ) ఇవన్నీ రచయిత్రికి సమాజం యెడ గల ప్రేమను తెలుపుతూ మంచిని పెంచాలన్న తపనను వ్యక్త పరుస్తాయీ మంచి కథలు.

సుప్రసిద్ధ చిత్రకారులు బాలిగారి అట్టమీది బొమ్మ అదనపు ఆకర్షణ.



– కూర చిదంబరం
సెల్: 8639338675

## మానవత్వం – మతోన్మాదం


మతం
ఒకప్పుడు?
చీకటి గుహల్లో
మనిషికి వెలుగునిచ్చిన దీపం.
చేతులు జోడించినప్పుడు
హృదయాలు దగ్గరైన
ప్రార్థనల భాష.
మానవత్వం
అది మతానికి మూలం,
దైవాన్ని చేర్చే దారి.
ఆకలితో ఉన్నవాడికి అన్నం పెట్టినప్పుడు
ఏ గ్రంథం పేరూ అడగలేదు,
ఏ దేవుడి గుర్తింపూ చూడలేదు,
అప్పుడు
మనిషి మాత్రమే కనిపించాడు.
కానీ?
ఎక్కడో
అక్షరాలు ఆయుధాలయ్యాయి,
వాక్యాలు విషమయ్యాయి.
ప్రేమ పేరుతో ద్వేషం,
రక్షణ పేరుతో రక్తం
పొంగిపొర్లింది.
అక్కడే పుట్టింది
మతోన్మాదం,
దేవుణ్ని ముందుపెట్టుకుని
మనిషిని చంపే పాపం.
మానవత్వం మాత్రం
మధ్యలో నిలబడి
రక్తంతో తడిచిన చేతులను
కడుక్కోమని వేడుకుంది.
మతం మానవత్వాన్ని మరిచిన రోజు
అది మతం కాదు,
దాని పేరు మతోన్మాదం.
మానవత్వం ఉన్నచోట
మతోన్మాదానికి చోటులేదు.
మతోన్మాదం ఉన్నచోట
దేవుని పేరు ఉన్మాద నినాదమౌతుంది.
అందుకే,
మతాన్ని కాదు,
మనిషిని కాపాడాలి,
మనిషిలోని మానవత్వాన్ని
వెలికి తీయాలి.!



– యం.డి. ఉస్మాన్ ఖాన్
9912580645

## సముద్రం సముద్రమే

ఉప్పగా ఉందంటారు
కాలాల రుచి దాని నీళ్లలో కరిగిపోయిందంటారు
సాగరఘోష చెవినబడి నిశ్శబ్దాన్ని చీల్చి
మనసును వేధిస్తుందంటారు
సముద్రానిది వెర్రిచేష్ట అంటారు
క్షణం ఒకసారి ప్రశాంతంగా
క్షణం ఒకసారి ఉన్మాదంగా
తనలో తానే తుఫానవుతుందంటారు
జనాలు వచ్చినా పర్యాటకులు సందర్శించినా
అక్కడ నిజమైన ఆస్వాదన ఉండదంటారు
మాటలు అలల శబ్దంలో కలిసి పోతాయంటారు
కోలాహలం హాలహలమే అంటారు
కానీ సముద్రం మాత్రం
తన స్వరాన్ని వినిపిస్తూ అలలు
ఉత్తుంగ తరంగాలుగా ఎగరేస్తూ ఉంటుంది
గిట్టనివాళ్ళు ఏమన్నా సరే
నిశ్శబ్దంగా నిత్యవసరాల సరకుల్ని సరఫరా చేసే
ఓడల్ని తీసుకెళ్తూ ఉంటుంది
ప్రపంచపు బరువులన్నీ అలుపే లేకుండాతన
గుండెల మీద మోస్తూ ఉంటుంది
సముద్రం సముద్రమే
అది మారదు
అది తగ్గదు
అది తానుగా
ఉండడానికే నిలుస్తుంది




– కోటం చంద్రశేఖర్
9492043348

# ఒక ఋషివంటి వ్యక్తి గురించి మరో యోగి నల్ల ఉపేందర్ శతకం

కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం మొత్తం సాహసం, పోరాటం, ధిక్కారం, త్యాగాలు, ఆదుకోవడాలు, ఎదురొడ్డి గర్జించడాలు, మానవీయ హక్కుల కోసం అనేక సార్లు జైళ్ళపాలై స్వయంగా ఒక ప్రవీణుడైన న్యాయవాదిగా రాజ్యాంగ బద్ధంగా విజయ ఢంకా మ్రోగించడాల వంటి సాహసోపేత చర్యలతోపాటు తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటంలో కమ్యూనిస్ట్ నాయకులు రావి నారాయణరెడ్డి. నల్లా నరసింహులు, ఆరుట్ల రామచంద్రారెడ్డి 'నయా జిందగీ' పత్రిక సంపాదకులు ఆచార్య జె.ఎన్.శర్మలపై బనాయించిన కుట్ర కేసులను వాదించి గెలిచిన ధీరోదాత్తుడు. పద్మశాలి కులబాంధవులందరికీ ఒక ఉత్తేజంగా, ప్రేరణగా, మార్గదర్శిగా, త్యాగశీలిగా భారత స్వాతంత్ర్యానంతర ప్రజలకు స్ఫూర్తిగా నిలిచిన మహనీయుడాయన. భారత రాజ్యాంగం స్పష్టంగా నిర్దేశించిన శాస్త్రీయ కులగణన జరిపి ఆ దామాషాలోనే పౌరులకు హక్కులనూ అధికారాలనూ కల్పించాలన్న అధికారాణాన్ని ఉల్లంఘిస్తూ గత పాలకులందరూ 'రెడ్డి తర్వాత రెడ్డే' వద్ధతితో ఒక నీచ దౌర్జన్యకర దోపిడీని దశాబ్దాలుగా కొన సాగకుండా ఉండి ఉంటే కొండా లక్ష్మణ్ బాపూజీ యెప్పుడో అవిభాజ్య ఆంధ్రప్రదేశ్కు బి.సి.ల తరపున ముఖ్యమంత్రి కావలసిన సంపూర్ణంగా అర్హుడైన మేధో సంపన్నుడాయన. పదవులను కొనగోటితో త్యజించి కుర్చీలకోసం ఎన్నడూ ప్రాకులాడని 'సింహతుల్యు'డతను. కొండా లక్ష్మణ్ బాపూజీ యొక్క ఈ మూల ధిక్కార తత్వాన్ని కవి నల్ల ఉపేందర్ ఈ క్రింది పద్యంలో ఎంత అద్భుతంగా చెప్పాడో చూడండి.

**ఇందిరవమ్మేంది, అమిచ్చు పదవులేంది**
**నా తెలంగాణ తప్ప నాకేమి వద్దు**
**అంచు భీష్మించి చేతిలో నున్న మంత్రి**
**పదవి తృణముగ త్యజియించె పద్మశాలి**

నిజాం విమోచనోద్యమంలో హైదరాబాద్ పౌర హక్కులపై తీవ్ర నిర్బంధం కొనసాగుతున్న రోజుల్లో తాను అధ్యక్షునిగా 'సిటిజన్ ప్రొటెక్షన్ కమిటీ ఏర్పాటు చేసి ప్రజా చైతన్య కార్యక్రమాల్లో భాగంగా.. నిజాం రాజును అంతమొందించడం






ప్రతులకు:
నల్ల ఉపేందర్
సెల్:7702556163

కోసం బాంబు దాడి వ్యూహాన్ని రచించిన బాపూజీ, నారాయణ రావ్ పవార్, గండయ్య గూడూరు నారాయణస్వామి, జగదీష్ ఆర్య అనే నలుగురు యువకలకు షోలాపూర్ క్యాంప్లో శిక్షణనిచ్చి ఆర్థిక సహాయం కూడా చేసిన

**నల్ల ఉపేందర్ రచన శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ శతకముకు ప్రొ॥ రామా చంద్రమౌళి రాసిన ముందు మాట**

ధీరోదాత్తుడు బాపూజీ. 1952, 1962, 1067 సంవత్సరాలలో వరుసగా ఆసిఫాబాద్, చిన్నకోడూర్ల నుండి శాసన సభ్యునిగా గెలిచి ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉపసభాపతిగా, మంత్రిగా, శాసన సభ్యునిగా భువనగిరి నుండి మళ్లీ గెలిచి కాసు బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో చిన్న తరహా, కుటీర పరిశ్రమల మరియు ఎక్సైజ్ మంత్రిగా సేవలందించి తర్వాత 1973 ఎన్నికలలో భువనగిరి నుండి గెలిచి 1973 లో పి.వి.నరసింహారావు తర్వాత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా అవకాశమొచ్చినా బి.సి.కార్డ్పై అప్పటి ప్రదాన మంత్రి ఇందిరా గాంధి ముఖ్యమంత్రికి బదులుగా గవర్నర్ ఇస్తానని ఆశపెట్టినా లొంగక కడపదాటివచ్చిన నిబద్ధుడు బాపూజీ. అప్పటి కొండా లక్ష్మణ్ గురించి రాస్తాడు కవి నల్ల ఉపేందర్ ఆర్ద్రంగా.. ఇట్ల...

**రెడ్ల తర్వాత రెడ్డికే మంత్రి పదవా?**
**ఎంతకాలమీ పదవుల ఎగురవేత**
**వలదు వలదు సంజీవయ్య కలడటంచు**
**వార్ని సి.ఎం.ను చేసినారు వీరు**

1952లో బాపూజీ రూపొందించిన 'చేనేత ఉత్పత్తుల క్రయ విక్రయాల సహకార సంఘాల ప్రాజెక్టు భారతదేశంలోనే ప్రప్రథమం. తెలుగు నేలపై సైకిల్ యాత్రలను, పాదయాత్రలను మొట్టమొదట ఆరంభించిన ప్రజ్ఞాశీలి కొండా లక్ష్మణ్ బాపూజీయే. 1961లో మూసీ నదికి భయంకరమైన వరదలు వచ్చినపుడు నల్గొండ పరివాహక ప్రాంతంలో 220 మైళ్ళు పాదయాత్ర చేసి పునరావాస కేంద్రాలను పర్యవేక్షించిన దయాశీలి బాపూజీ. ఐతే ఈ సాహసాలకు ఫలితంగా ఏ పదవులనూ ఆశించని నిస్వార్థ జీవి అతను. కరుడుగట్టిన తెలంగాణ వాది ఐన కొండా 1969 ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకై ఆరంభించిన తొలిదశ ఉద్యమంలోనూ తర్వాత రవాత 1996 నుండి మొదలైన మలిదశ ఉద్యమంలోనూ కొండా లక్ష్మణ్ అతి చురుకైన పాత్రను పోషించారు. 1958 లో సచివాలయం సమీపంలో ఇప్పటి నెక్లెస్ రోడ్ దగ్గర తను కొనుక్కున్న స్థలంలో **'జలదృశ్యం'** పేర భవనాన్ని నిర్మించుకుని అప్పటి యువతరానికి ఒక ఉద్యమ వేదికనే ర్పర్చిన దాతృమూర్తి బాపూజీ. ఆయన భార్య డాక్టర్ శకుంతల సేవాపరాయణురాలైన డాక్టర్. సైన్యంలో పనిచేసి దేశసేవ చేసింది. వీరికి ఒక కూతురు. ఇద్దరు కుమారులు. ఒకరు భారత సైన్యంలో వైమానిక దళంలో ఉంటూ దేశసేవలో వీరమరణం చెందారు. ఈ వివరాలు బాపూజీ యొక్క కుటుంబ జీవితం కూడా ఎంత ఉదాత్తమైందో మనకు తెలియజేస్తుంది. ఏ సామాజిక ఉద్యమానికైనా తన అండదండలను అందించే కొండా లక్ష్మణ్ బాపూజీ తన నివాసమైన 'జలదృశ్యం'ను 1997 నవంబర్లోనే 'తెలంగాణ ఐక్యవేదిక కార్యాలయాన్ని నడుపుకునేందుకు అనుమతించారు. తర్వాత చారిత్రక తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ కూడా జలదృశ్యం ప్రాంగణంలోనే ఆవిర్భవించింది.


తర్వాత తెలంగాణ ఉద్యమం తీవ్రతరమై ఆంధ్ర వలసపాలకుల గుండెల్లో రైళ్ళు పరుగెత్తుతున్న కాలంలో నారా చంద్రబాబు నాయుడు ఒక రాత్రికి రాత్రి బాపూజీ హైదరాబాద్లో లేని సమయంలో అతని జలదృశ్యం.. భవనాన్ని నేలమట్టం చేసి ఘాతుకానికి ఒడిగట్టినపుడు. బాపూజీ కించిత్తు కూడా జడువక తన న్యాయవాద వృత్తిలో రాటుదేలిన ప్రతిభతో ప్రభుత్వం మెడలు వంచి తన 'జలదృశ్యాన్ని' మళ్ళీ హైకోర్ను ఒడి స్వాధీనం చేసుకున్నాడు.

ఒకవైపు తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చే క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం దోబూచులాడుతున్న క్రమంలో 1.11.2011న దేశ రాజధాని ఢిల్లీలో తీవ్రమైన చలిలో ఒంటరిగా జంతర్మంతర్ వద్ద కొండా లక్ష్మణ్ బాపూజీ సత్యాగ్రహ దీక్షను ప్రారంభించారు.

ఈ విధంగా తుది శ్వాస విడిచారు లక్ష్మణ్ బాపూజీ. జీవితమంతా అవిశ్రాంత పోరాటం చేస్తూ చేస్తూ అలసిన బాపూజీ తన 96వ ఏట 2012 సెప్టెంబర్ 21న నిష్క్రమించారు.

**కొండ లక్ష్మణ్ బాపూజీ కోరుకున్న**
**యూనివర్సల్ ఫౌండేషన్ను పూని నిలిపి**
**తనదు ఆస్తిని మిగిలిన ధనమునంత**
**దాని పేరుతో వ్రాసిందు ధర్మమూరి.. నల్ల ఉపేందర్గారి ఆశంస ఇది..**

కొండా లక్ష్మణ్ బాపూజీగా తెలంగాణీయుల గుండెల్లో ఒక శాశ్వతజ్యోతిగా వెలిగే ఈ సామాజిక వీరుణ్ణి అతని త్యాగాలనూ స్మరిస్తూ సాహిత్య కృషీవలుడు మిత్రుడు నల్ల ఉపేందర్ తనదైన శైలిలో ప్రస్తుతిస్తూ ఈ తరం కోసం అతి సరళ సుళువైన రీతిలో ఈ శతకాన్ని అందిస్తున్నారు. వారిని హృదయ పూర్తిగా అభినందిస్తున్నాను..




-ప్రొ॥ రామా చంద్రమౌళి
కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత

# ప్రభాత కిరణాలైన కవితాక్షరాలు

**"రవి కననిది కవి యెరుగును**
**కవి ఎరుగని చోటు రవియు గానడు"** అని వేమనా మాత్యుడు చెప్పినట్లు రవి గాంచనిది కవి గాంచ గలడు అన్న మాటల్లో యదార్థం ఉంది. కవి సత్యాన్వేషి, నిత్యాన్వేషి యదార్థవాది. సాహితీ సేద్యం చేస్తూ కవిత్వాన్ని పండిస్తాడు. తాను సమాజంలో చూస్తున్న యదార్థ సంఘటనల్ని, మార్పుల్ని, జీవిత సత్యాలుతో పాటు సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, దోపిడీలు, దురాగతాలే. అరాచరాలు వంటి దుశ్చర్యల్ని తన కవిత్వం ద్వారా ఖండిస్తాడు. ఆ అంశాల్ని వస్తువులుగా తీసుకుని కవితాక్షరాలుగా మలచి ఆవిష్కరిస్తారు. ఇందుకు మనసులో ఎంతో మథనం జరుగుతుంది. ఆలోచనలు పోటీపడి ఓ మంచి పదాల కూర్పుగా ఏర్పడి కవి కలం ద్వారా అక్షరాకృతిని పొంది కవిత్వమై విరాజిల్లుతుంది.

ప్రస్తుతం సమాజంలో కవిత్వం వ్రాసేవారు ఎక్కువ వుతున్నారు. ఒక వాక్యాన్ని నాలుగు ముక్కలుగా చేసి నిలువుగా వ్రాసి ఇదే కవిత్వం అనే పరిస్థితి ఏర్పడింది. అంటే వర్టికల్గా రాస్తే పొయిట్రీ హారిజంటల్గా వ్రాస్తే ప్రోజ్ అయిపోతుంది. కవిత్వంలో సెన్సు ఉండాలి అసెన్స్ ఉండాలి, మెసేజ్ కూడా ఉండాలి. అపుడేగా సమాజానికి ఉపయోగపడేది. కవిత పురుడు పోసుకోవాలంటే అంత తేలికకాదు. కఠోరమైన మానసిక మథనం జరగాలి. మనసు పొరల్లో దాగిన అక్షరాలు పదాలుగా జత కట్టాలి. ఆ పదాలు భావ గర్భితంగా బారులు తీరాలి. అపుడే కవి మనస్సు సేదతీరు తుంది.

కవిత్వం చదివితే మానసికోల్లాసం కలగాలి. బాధాతప్త హృదయాల ను ఓదార్చగలగాలి. జీవితంలో ఓటమి






ప్రతులకు:
సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు
ఇ.నెం.9-45
షిర్డిసాయినగర్. రోడ్.నెం.1
అశ్వారావుపేట-507301
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.
సెల్:94913 57842

అంచున ఉన్నవారికి గెలుపు బాట చూపించగలగాలి. దుర్మార్గులను సన్మార్గులుగా మార్చగలగాలి. రాసి కంటె వాసికి ప్రాధాన్యం ఉండాలి. అల్పాక్షరాల్లోనే అనంతమైన భావాన్ని పొదగగలగాలి. అటు వంటి కవిత్వాన్ని వ్రాస్తున్న సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు గారు గతంలో ఎన్నో కవితా సంపుటాలను వెలువరించారు. **"కవిత్వం కవి కోసం కాదు సమాజం కోసం"** అనే సిద్ధాంతాన్ని నమ్మిన కవి సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు.

బాగా చదువరికనుకనూ, భావి భారత పౌరులను తీర్చిదిద్దే బృహత్తర వృత్తిలో ఉండటం చేతనూ ఆయన సమాజాన్ని నిరంతరం అధ్యయనం చేస్తూ వస్తున్నారు. నిత్య విద్యార్థిగా సమాజాన్ని అధ్యయనం చేస్తూ మంచి చెడులను బేరీజు వేసు కుంటూ వాటిని వస్తువులుగా మలచుకుని, మనసులో తలచు కొని ఎలా కవిత్వీకరించాలో తలంచుకుని ఎవరికీ తలవంచక ధీవిగా కవిత్వాన్ని ఆవిష్కరించేతత్వం, మనస్తత్వం కలిగిన కవి. వారి మస్తకం నుండి జాలువారిన ఈ కవితాక్షరాలు ప్రభాత కిరణాలై **"ప్రభాత కెరటాలు"** పేరుతో మీ ముందుకొచ్చింది. మొత్తం 37 కవితలు. ఈ పొత్తం లో నిక్షిప్తమయ్యాయి. అన్ని పఠించదగినవే. అన్నీ కవితా భావాన్ని నింపుకున్నవే కొన్నిటిని పరిశీలిద్దాం.

**అందరి ఆకలి తీర్చగల అన్నదాత**
**తన ఆకలి తీర్చుకోలేక**
**పల్లె వదిలి పట్టణంలో**
**కూలీగా చేరితే**
**హాలికుడు అంతర్థానమై**
**అన్నం కనుమరుగవుతుంది**

అంటారు. **"అదృష్టదృశ్యం"** అనే కవితలో. వ్యవసాయ రంగం పరిస్థితిని విశ్లేషించారు. ఆరుగాలం శ్రమించినా వాతావరణ పరిస్థితుల వల్ల సకాలంలో వర్షాలు రాక చీడ పీడల వల్ల పంట చేతికి రాకపోతే రైతు **"రైతుకూలీ"**గా మారిపోతే అన్నం పెట్టే దిక్కెవరు? ప్రజలు అన్నమో రామచంద్రా అని అలమటించరూ!

**సృజనశక్తి గల యువత**
**రోషావేశాలకు గురికాక**
**శాంతికపోతాలై ఎగరాలి**
**కార్పొరేట్ కబంధ హస్తాల్లో**
**నలిగిపోతున్న ఈ దేశాన్ని**
**రక్షించేందుకు**
**నేటియువత వివేచన చేసి**
**ముమ్ముందుకే దుమకాలి**

అంటారు **'శాంతి కపోతాలై'** అనే కవిత ద్వారాయువత నిర్వీర్యం కాకూడదంటారు కవి.

**సిద్ధాంతపు ప్రభాకారాచార్యులు రచన "ప్రభాత కెరటాలు" పుస్తకానికి తూములూరి రాజేంద్రప్రసాద్ రాసిన ముందుమాట.**

నేటి యువతే రేపటి పాలకులు, దేశాభివృద్ధికి పట్టుకొమ్మలు. స్వామి వివేకానందుడు యువత కోసం ఎన్నో మంచి విషయాలు ఉద్బోధించారు. ఆయన స్ఫూర్తికి యువత ప్రభావితమై దేశ కీర్తి ప్రతిష్టలు దశ దిశలా వ్యాపించేట్లు పాటు పడాలని కవి అక్షరీకరించారు.

**మద్యపానం వద్దన్నావు**
**ఇప్పుడు ఎక్కడ చూసినా**
**బార్లు బార్లా తెరుచుకున్నాయి**
**ఓ మహాత్మా మన్నించు**
**ఈ దస్థితిని మార్చేందుకు**
**వీలుంటే మళ్లీ జన్మించు**

అని **"ఓ మహాత్మా మన్నించు"** ఇది ఎంతో భావాన్ని, బాధనూ, ఆవేదనను నింపుకున్న కవిత.

గాంధీజీ కన్న కలలు కల్లలుగానే మిగిలిపోతున్నాయనే కవి ఆవేదన వర్ణనాతీతం. మద్యపానం వద్దన్న దేశంలో చివరికి ప్రభుత్వమే బార్ షాపులను నడపాలని నిర్ణయించడం నిజంగా బాధాకరం.

అందుకే ఈ దుస్థితిని మార్చడం పాలకుల వల్ల కాదు. అందుకే గాంధీ మరల జన్మించాలి అని కోరు కుంటున్నాడు కవి.

**నీటి వృధాను అరికట్టాలి**
**ప్రతీ నీటిబొట్టును ఒడిసి పడితేనే**
**సకల జీవకోటికి ప్రయోజనం**
**అభివృద్ధి పేరిట ప్రకృతిని కబళించే**
**రాక్షసక్రీడకు చరమగీతం పాడాలి**
**ధరిత్రిపై పచ్చదనమే కరువయింది**
**కూర్చున్న కొమ్మను**
**తెగనరుక్కుంటున్న చందాన**

అంటూ **"ఇంకుడు గుంతలు నిర్మిద్దాం"** అనే కవితలో చెప్పారు. వర్షపు నీటిని నిల్వ చేసుకోలేకపోతున్నాం కారణంగా భూగర్భ జలాల మట్టం నానాటికి తరిగిపోతుంది. ప్రజలకు వర్షాలు లేని కాలంలో దాహార్తి తీర్చేదెవరు? నీరు జీవనాధారం, జీవాధారం అనే మాటలు గుర్తుపెట్టుకొని వర్షపునీరు భూమిలోకి ఇంకిపోయేందుకు ప్రతి ఇంట్లో ఒక ఇంకుడుగుంత త్రవ్వితే నీటి కొరత తీరుతుంది.

దేశం సస్య శ్యామలం అవుతుంది అంటారు కవి.

ఈ కవిత వ్రాయడం ద్వారా కవికి పర్యావరణ పరిరక్షణకై మంచి అవగాహన, స్పృహ ఉన్నట్లు తోస్తోంది.

ఈ విధంగా మంచి సామాజిక అంశాలను వస్తువులుగా తీసుకొని కవితలుగా ఆవిష్కరించిన సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు గారిని అభినందిస్తున్నాను.

ఇందులో పొదిగిన 37 కవితల్ని విశ్లేషించడం సమంజసం కాదు గనుక కొన్నిటిని మాత్రమే నా మాటలో పొందుపరిచాను.

అన్ని కవితలు చదవాల్సినవి, చదివించాల్సినవి. ప్రతి కవిత పాఠకుడిలో మార్పును కోరుకుంటుంది.

ఆలోచింపచేస్తుందనుటలో సందేహం లేదు.

మంచి కవితా సంపుటిని సమాజానికి అందించిన ప్రభాకరాచార్యులుగారిని అభినందిస్తున్నాను.



-తూములూరి రాజేంద్రప్రసాద్
9490332323

## నానీలు

**రా**జకీయ హామీలు
తుస్‌మన్నాయి
ఉద్యోగుల ఆశలు
అటకెక్కాయి.

**మ**నసున్న మనిషికి
అన్నీ కష్టాలే
లేని మనిషికి
అన్నీ సుఖాలే!

**మ**నసున్న మనిషికి
సుఖం ఉండదు.
లేని మనిషికి
ఎన్నో సౌకర్యాలు.

**ఉ**ద్యోగానికి రాజీనామా
రాజకీయ ప్రవేశం
దోచుకుని
దాచుకోటానికా?

**రా**జకీయ రణరంగం
సిగ్గు ఒగ్గు ఒదిలేసింది
బూతులతో
బలిసింది.




-బొబ్బిలి జోసేఫ్ 9989261991


# ఏరు తడిపిన గట్ల సంగతులు

చీకోలు సుందరయ్య గారి **'తరతరాల తెలుగు విశేషాంశాలు. సాహిత్యాంశాల'** గురించి రాసేందుకు నాకు ఏ అర్హతా లేకున్నా ఆయన వాత్సల్యం వల్ల ఈ ప్రయత్నం చేయడం జరిగింది. అంతే.

ఈనాడు దినపత్రికలో దాదాపు పదిహేను సంవత్సరాల కిందట రాసిన వ్యాసాలు చీకోలు సుందరయ్య రెండు సంపుటాలుగా తీసుకుని వస్తున్నారు. 'తరతరాల తెలుగు-1 (విశేషాంశాలు) అనేది మొదటి సంపుటి. తెలుగువారి సంప్రదాయాలకు, సంస్కృతికి, భాషకు, జీవనానికి, చరిత్రకు సంబంధించి ఎన్నో విశేషాలను పరిశోధించి ఇందులో ఏరికూర్చారు. కొన్ని వ్యాసాలను చదువుతుంటే ఎంత లోతుగా అధ్యయనం చేస్తేనో కదా ఈ విశేషాలు తెలిసేది అనిపిస్తుంది. ఆయన విజ్ఞాన విస్తృతికి తార్కాణంగా కనిపిస్తాయి.

ఇదొక విచిత్రమైన పుస్తకం. ఎందుకంటే ఏదో ఒక జోనర్లో ఇమిడిపోయినట్లు కనబడదు. దీన్ని నిక్కచ్చిగా పరిశోధనా గ్రంథం అనలేం. కానీ ఎంతో లోతుగా పరిశోధించి చెప్పిన అనేక విషయాలున్నాయి. అలా అవి సరదాగా చదువుకునే పుస్తకం అని చెప్పలేం. కానీ ఆసక్తి కలిగించే విచిత్రాలు, వింతలు, విశేషాలు ఉన్నాయి. వ్యాసాలు మరీ సీరియస్‌గా, గంభీరంగా సాగినట్లు అనిపించవు. కానీ గంభీరమైన విషయాలను స్పృశిస్తూ సాగిపోతుంది. పరిశోధన తాలూకు వేడికి, ఆసక్తి కలిగించే హాయికి మధ్య ఉండే సన్నని రేఖ



ప్రతులకు:
చాకోలు
సుందరయ్య
90300 00696

మీద సాగిపోయే వ్యాసాలు ఇవి. కొంతమేర యువ తరానికి పోటీ పరీక్షలకు పనికి వచ్చేలా ఉన్నాయి వ్యాసాలు. ఆ కారణం చేత ఇది విలక్షణమైనదని చెప్పవచ్చు.

ఇదొక విశేషమైన గ్రంథం కూడా. ఎందుకంటే ఈ పుస్తకం చదువుతుంటే వేయి సంవత్స

**(చీకోలు సుందరయ్య రచన తరతరాల తెలుగు పుస్తకానికి కె.వి.కిశోర్‌కుమార్ రాసిన ముందు మాట..)**

రాలుగా ఎక్కువ కాలంలో తెలుగుజాతి ప్రస్థానాన్ని, తెలుగు తనపు పోకడలను, సాహిత్య చరిత్రను, సాంస్కృతిక అంశాలను తట్టి గుర్తు చేసినట్లు ఉంది. గతంలో ఆరుద్రవారు సమగ్రాంధ్ర సాహిత్యం పేరిట ఒక బృహత్ గ్రంథం తీసుకుని వచ్చారు. ఇంకా కాశీనాథుని నాగేశ్వరరావు, దివాకర్ల వెంకటావధాని కూడా విడివిడిగా ఆంధ్ర వాఙ్మయ చరిత్రను వెలయించారు. పింగళి లక్ష్మీ కాంతం వారు కూడా ఆంధ్ర సాహిత్య చరిత్ర పేరిట ఒక గ్రంథాన్ని తీసుకుని వచ్చారు. ఆచార్య జి.వి. సుబ్రమణ్యం కూడా తెలుగు కవుల సాహితీ ప్రక్రియల స్వరూప స్వభావాలను విశ్లేషిస్తూ **"సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు"** అన్న వ్యాస పరంపరను రచించారు. అలాగే జి. నాగయ్య, వెలమల సిమ్మన్న, ద్వా.నా.శాస్త్రి వంటివారి కృషి కూడా ప్రశంసనీయం. ఇవన్నీ పూర్తిగా సాహిత్యం మీదనే దృష్టి సారించిన గ్రంథాలు. ఈ 'తరతరాల తెలుగు విశేషాంశాలు, సాహిత్యాంశాలు' మాత్రం సాహిత్యంతో పాటు తెలుగు వారి సంస్కృతిని, జీవనశైలిని, మనస్తత్వ స్థితిని, ఇతర భాషలతో ఉన్న సంబంధాలను, పరస్పర ప్రభావాలను, ఉద్యమాలను, శైలీ విన్యాసాలు తదితరాలను ఉటంకిస్తుంది.

ప్రధానంగా భాష కేంద్రంగానే సాగినా సుందరయ్యగారు ఇందులో తెలుగువారి నవ్వుల గురించి చెప్పారు. ఏడుపులను గురించి వివరించారు. తెలుగువారి హాస్య ప్రియత్వం, భోజన ప్రియత్వం, వంటలు, తాంబూల సేవనం గురించీ ముచ్చటించారు. అలంకరణల విశేషాల ను చిలకరించారు. రకరకాల పెళ్లిళ్ల గురించి తెలిపారు. పురాణాల్లో స్త్రీల పాత్రల గురించి, వారి వ్యక్తిత్వాలు, పగలు, ప్రతీకారాలు, తిరుగుబాట్ల గురించి చర్చ చేశారు. వినోదకళలు తెలియజేశారు. కవులు ఎంతగానో ఇష్టపడిన వెన్నెల, చందమామ, కృష్ణానది, సముద్రం, గ్రీష్మ ఋతువు వంటి వాటి గురించి ఏయే కవులు ఏవిధంగా ప్రస్తావించారో గుర్తు చేశారు. అసలు తెలుగు తీయదనాన్ని ఎవరెవరు ఏవిధంగా వర్ణించారో చెప్పారు. నన్నయ్య, పాల్కూరికి సోమ నాథుడు మొదలుకొని గురజాడ, రాయ ప్రోలు, చలం, నిన్న మొన్న టి సినారె, శేషేంద్రతో సహా ప్రస్తుతం దిగ్గజాలైన శివారెడ్డి దాకా ఎంతోమంది కవులను, సాహిత్యమూర్తుల ప్రస్తావన మనకు ఇందులో కనిపిస్తుంది. సాహిత్య ప్రక్రియలైన కావ్యాలు, కథలు, నవలలు, వ్యాసాలు, కథానికలు, శతకాలు, చరిత్రలు, స్వీయ చరిత్రలు... ఇలా అనేకాంశాలను మనం ఈ పుస్తకాల్లో మరోసారి జ్ఞాపకం చేసుకోవచ్చు. అదే విధంగా సంస్కృతితో ముడిపడిన బుర్ర కథలు, హరికథలు, యక్షగానా లు, నాటకాలు, భాగవతులు వంటి వాటిని కూడా పలకరించారు. తెలుగు వారికే ప్రత్యేకమైన అవధానం గురించి, క్రైస్తవ సాహిత్యం, ముస్లిం సాహిత్యం గురించి కూడా చెప్పారు.

వివిధ తాత్త్వికులను పరిచయం చేశారు. వారి వారి తత్వ చింతనను వారి మీద పడిన ప్రభావాలను, సమాజం మీద వారు చూపిన ప్రభావాన్ని జ్ఞప్తికి తెచ్చారు. జాతియోద్యమాలు, గ్రంథాలయోద్యమాలు, కవిత్వోద్యమాలు, భాషా ఉద్యమాలు... ఇలా అనేక రూపాల్లో మన చరిత్రకు సంబంధించిన చిత్రాలను సంక్షిప్తంగా ప్రదర్శించారు. వివిధ వాదాలను గురించి స్థూలంగా వివరించారు. ఇక తరతరాల తెలుగు-2 (సాహిత్యాంశాలు) మొత్తం సాహిత్యం మీదనే దృష్టి సారిస్తుంది. సాహిత్య పత్రికల గురించి, తెలుగు సాహిత్య సేవ చేస్తున్న సంస్థల గురించి విస్తృతంగా చర్చించడం గమనించ వచ్చు. వేమనతో మొదలుపెట్టి కబీరు, ఉమర్ ఖయ్యాం, గురజాడ, విశ్వనాథ, రాయప్రోలు, శ్రీశ్రీ, చలం వంటి దిగ్గజాలతో పాటు అనేక కథకుల గురించి స్పృశిస్తూ సాగుతుంది. మన విమర్శకులు ఎవరు, వారు చేసిన సేవ ఎలాంటిది వివరిస్తుంది. ఇంకా మన సాహిత్య చరిత్రకారులను స్మరింప జేస్తుంది. తెలుగులో వచ్చిన వివిధ వాదాల గురించి ముచ్చటిస్తుంది. అనుభూతి కవిత్వం, కాల్పనికవాదం, అభ్యుదయవాదం, దిగంబర కవిత్వం, సాయుధ పోరాటవాద కవిత్వం, దళిత సాహిత్యం, స్త్రీవాద సాహిత్యం వంటి ముఖ్యమైన పోకడలను విస్తారంగా చర్చించింది. నిన్న మొన్న మొలకెత్తిన హైకూల కబుర్లు కూడా ఉన్నాయి మరి. గ్రంథాల పేర్లలో తెలుగు అని ఉన్నా పలుచోట్ల భారతీయ ఆత్మను ఆవిష్కరింపజేసే వ్యాసాలు ఉండడం మరో విశేషం. భాష ఒక నది. సాహిత్య పరిణామం ఒక ప్రవాహం. సంస్కృతి ఒక స్రవంతి. ఏరు తడిపిన గట్ల సంగతులు ఈ వ్యాసాలు. ఇవి సాహితీప్రియులకు, వివిధ పోటీ పరీక్షార్థులకు ఎంతో ఉపయుక్తం.

-కె.వి. కిశోర్‌కుమార్
కేంద్ర ప్రభుత్వ అధికారి, విమర్శకుడు.

## నానీలు

**ఓ**టరు మహాశయు
రేపటికి దేవుళ్ళు
ఐదేళ్లకు
భక్తులు



-చాపలమహేందర్
9949864152

**ప**ళ్లెంలో ఊరిస్తూ
పిండివంటలు
తినే భాగ్యంలేని
అభాగ్యవంతులు!
-ఎస్.ఎం.సుభాని
9490776184





పుస్తక సమీక్ష

# సమాజహితంతో శతకం-ధీనిధి

అజరామరమైన ప్రక్రియ పద్యము. పద్యమంటే నాకు అత్యంత ఇష్టమైన ప్రక్రియ. అందుకే బండకాడి అంజయ్య గౌడ్ ఇరవై ఆరవ పుస్తకాన్ని విడుదల చేశారు. నిజంగా గౌడ్‌గారికి లభించిన బిరుదులు సార్థకం గావించి పలు పసందైన రచనలను సాహితీలోకం చేతిలో పెట్టారు. దీనిధి శతకము ఆద్యంతం పాఠకుడిని కూర్చోబెట్టి చదివిస్తుంది. సామాన్య పాఠకుడికి ఇట్టే అర్థం అవుతాయి. ఆయన ఆలోచనలు ప్రత్యేకంగా అనిపిస్తాయి. ఇంగువలేని చారు, **హృదికి ఇంపుగా లేని సారము లేని గాథ, వీరంగం లేని జాతర, అనురాగం లేని బంధం, కొంగలు లేని చెరువు, కవి కోవిదులు లేని ఊరు, లంగరు లేని నావ వలే రాజీల బోవు** అంటూ చెప్పిన తీరు ఎంత బాగుందో కదా! ఇలానే వున్నాయి. ఈ ధీనిధిలోని పద్యాలన్నీను. ఉత్పలమాల చందస్సుతో సుభాషితాలుగా అందించిన పద్యాలు పెద్దలకు పిన్నలకూ మార్గదర్శకాలే. ఈ పద్యాలు ప్రయోజకాలనే చెప్పాలి. అమ్మను మించిన దైవము, దయార్ద్రత మించిన సద్గుణంబు, క్లేశమును మించు రోగము, ప్రశాంతతను మించు సుఖం, హీనభావాన్ని మించు దుఃఖం, లోకమ్మున లేదు అనడంలోని సత్యాన్ని గ్రహించాల్సి వుంది. అంబలి త్రాగియైనా సరే వుండు,కానీ అప్పులు మాత్రం సేయకు, గొప్పల కోసం వింత పోకడలు వద్దంటూ హితవు పలికారు.

అందం శాశ్వతం కాదని, వికలాంగులను చూసి చీదరించు కోరాదనీ, కురూపిని చూసి సాయం చేసి వారి ఆక్రందన బాపువాడే ఈ ధరలో శాశ్వత కీర్తిని పొందుతాడన్నాడు. ప్రతి పద్యమూ చదివిన తర్వాత ఏం రాసాడండీ అనిపించక పోదు. ఏ యుగ ధర్మమైనా సరే ఎల్లరకునూ సుఖశాంతులిస్తూ, హాయిని కూర్చకపోతే అది ధర్మము ఎలా అవుతుంది లోకములో అంటూ ఒక గొప్ప ప్రశ్ననే వేసాడు. శీలము లేకుండా బడాయి, డంఖము, బింకము మానరిక అంటూ హితవు పలికారు. ఈయనను సహజ కవి అనడం సబబుగా వుంది. సామాజిక అంశాలను ఎన్నుకుని ఎవ్వరినీ ఇబ్బంది పెట్టకుండా అక్షరాలను పొందికగా పద్యాలుగా మలచి విందు చేశాడు సాహితీప్రియులకు.



ప్రతులకు: బి. అంజయ్యగౌడ్, రేణుకా నిలయం, ఇ.నెం. 2-11/231పి, సాయి బాలాజీ ఎన్‌క్లేవ్, మల్లంపేట్ దుండిగల్ (మం॥)మెడ్చల్ జిల్లా-500 090 తెలంగాణ. సెల్:9096163962



- డా॥ పులివర్తి కృష్ణమూర్తి
సెల్:9949092761

## బిచ్చ 'గాడు' !!

ఏది దొరికితే అదే
ఎప్పుడు దొరికితే అప్పుడే
సకల జనుల భిక్షను స్వీకరించే వాడే
నిరాడంబర బిచ్చ గాడు !!
ఆలస్యంగా దేవతల్లా ఎప్పుడో కాదు
అప్పటి కప్పుడే "అన్నదాత సుఖీభవ!"అంటూ
ఆశీర్వచనం ఇచ్చి పుణ్య ఫలాన్ని
తిరిగి ఇస్తాడుబిచ్చ గాడు !!
భూలోకంలో ప్రత్యక్షంగా
మన ఎదురుగా కనిపించే బిచ్చ 'గాడ్'

**-కందాళై రాఘవాచార్య,** 8790593638

తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం - కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..



నిర్వహణ
**-కందుకూరి శ్రీరాములు**
**-బెల్లంకొండ సంపత్ కుమార్**

## ఈ లోకం భాషల నాకం

పుడమి
ఏమి పుణ్యం చేసుకుందో
పుట్టేడు భాషల ఫలం పొందింది
పుడమిజీవులన్నిటికీ భాష వరం!
దుర్మార్గం దుశ్చర్యలతో కావద్దు అకం
భాషలు భావాలు కలిసిన లోక హితం
మాతృ భాష నీకు పరమహితం
అవని అనేక భాషల సంఘమము
అందుకే అవతారాల ఆగమము!
మనిషికి మాట -భాష రానినాడు
పశుపక్షాదులు మాట్లాడుకున్నవట
శ్రీ, కాళ, హస్తి, లు పూజలుచేసినవట
శకుంతలను పక్షులు పెంచినవట
గండభేరుండ పక్షులు
చిలుకలు మాట్లాడేవట!
గోమాత మాట సింహం మన్నించిందట!
పంచతంత్ర కథలు వినలేదా!
మనిషి మాట భాష నేర్చినాక ఏమైందో
పశుపక్షాదులు మనిషికి తెలియకుండా
తమశైలిలో సంభాషించుకుంటున్నవట!
అనంత భాషల సమన్వయం తో
ఈ లోకం భాషల నాకం అయింది!
(ఫిబ్రవరి 21,అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం)

**-పట్లోళ్ళ బక్కారెడ్డి**
9705315250

## ఒక్క రైతే

ప్రకృతిని మించిన అందం
జలపాతాల సవ్వడికి
మించిన సంగీతం
కోకిలను మించిన స్వరం
నెమలి నాట్యాన్ని మించిన నృత్యం
అమ్మ ఒడిని మించిన
స్వర్గం ఇలలో లేవు
ప్రకృతి,అద్దం రెండూ ఒకటే
అద్దం నువ్వు ఎలాగ ఉంటే
అలాగే చూపిస్తుంది
ప్రకృతిని నువ్వు ఎంత కాపాడితే
అది నిన్ను అంత కాపాడుతుంది
ఇప్పుడు ప్రకృతిని
మనమందరం కలిసి బాధపెడుతున్నాం
కానీ ప్రకృతి బాధపెట్టినప్పుడు మాత్రం
ఎక్కువగా నష్టపోయేది ఒక్క రైతే

**- బంగరిగల్ల గాయల్**
పదవ తరగతి

## ఓ ఆకాశమా !

ఓ ఆకాశమా!
నీ నీలి రంగుతో
మమ్మల్ని ఆహ్లాదపరుస్తున్నావ్
మేమంటే ఎంత ప్రేమ నీకు.
వర్షాన్నిచ్చే మబ్బులకు
కాంతిని వెదజల్లే
సూర్యచంద్రులకు
అబ్బురపరిచే ఇంద్రధనుస్సుకు
ఆవాసమౌతున్నావ్.
హాయిగా ఎగిరే పక్షులకు
విశాల మైదానమవుతున్నావ్
అందర్నీ మోసే భూమికి
గొడుగవుతున్నావ్.
నీ రూపం విశాలం
నీ హృదయం విశాలం.

**- ఎండబెట్ల హర్షిత**

## మాతృభాష

తల్లి పొత్తిల్లల్లుంటె
మాతృభాష నాటుకుంటె
తుంచకుండ పెంచుకుంటె
వృక్షమౌను చాటుకుంటె
మాతృభాష కాపాడితె
నిలబెట్టును ఉనికి !
విశ్వంలో ఉన్నావని
విలువ పెరుగు పనికి !!
(22-2-2026 మాతృభాష దినోత్సవం సందర్భంగా)

**-కందుకూరి శ్రీరాములు**
9440119245

## వర్షం

వర్షం
నేలతల్లి దాహమేకాదు
మన దాహమూ తీర్చుతుంది
దానికి పట్టింపులెక్కువ
ఉరుములు మెరుపులు
ఆహ్వానిస్తేతప్ప అది రాదు
అడవి తల్లే
దానికిష్టమైన బంధువు
అందుకే అడవి లేకపోతే
వర్షం మనకు
ముఖం కూడా చూపించదు

**- మానెపల్లి వైష్ణవి**
పదవ తరగతి



**-డా॥రావి రంగారావు**
9247581825

ఫేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో డా. రావి రంగారావు 2024 జనవరి నుంచి వారం వారం సాహిత్యం వర్క్ షాపులు నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు.

ఈ వారం నిర్వహించిన కథల వర్క్ షాపులో "కోడి పుంజు పందేలు" నేపథ్యంగా కథ రాయాలని సూచించడం జరిగింది.

ఈ వర్క్ షాపులో బహుమతి పొందిన శ్రీనివాస శాస్త్రి గారి కథ "నిజమైన గెలుపు" చదవండి.

-సంపాదకులు




రెండు కోడిపుంజులూ బరిలో నువ్వానేనా అన్నట్లుగా పోరాడుతున్నాయి.

శ్రీకర్ మైదానం ముందు నించుని వాటినే చూస్తున్నాడు.

ఇంతలో వాటిలో ఎర్రగా వున్న పుంజు నల్లటి పుంజుపైకి ఎగిరి చేసిన ఎదురు దాడికి అది ఒక్కసారిగా మెడ వాల్చేసింది.

అంతే ఒకటే ఈలలు.. చప్పట్లు ..

నేను చెప్పానా "ఈరోజు నక్షత్రం ప్రకారం "నెమలి" ముందు "డేగ" నిలబడదని" అని ఒకా టయన గర్వంగా మీసం మెలిశాడు.. ఈరోజు ముదురు రంగే గెలాల..మరెందుకు ఇలా అయిందో, నా పందెం పోనాది'' నీరసంగా అన్నాడు మరొకాయన..

కోడి పందాలు డబ్బు తో వేయడం నిషేధం కనుక పండగ సంబరాల లో ఆట లాగా ఉంటుందనుకుని వచ్చాడు శ్రీకర్. కానీ డబ్బు ఓపెన్ గా చేతులు మారుతూ కనిపిస్తూనే ఉన్నది "పోలీస్ వారు ఏం చేస్తున్నారో మరి"

అయినా వాళ్లకు తెలీకుండా జరుగుతుందా? ఫారిన్‌లో అయితే నేరం జరిగిన గంటలో నేరస్తులు దొరికి పోతారట.. ఇక్కడ నేరం జరిగే ఒక రోజు ముందే పోలీస్ లకు తెలిసిపోతుంది" అని నవ్వుకున్నాడు శ్రీకర్.

"ఒరేయ్ వెంకట్రావ్, బేగి ఇలారా, మన పుంజు గెలిచింది" అని గుంపులో నుండి ఒక పరిచయమైన గొంతు వినిపించి అటు చూశాడు శ్రీకర్.

అతను, పని మనిషి లక్ష్మి భర్త శీను. నిన్న పొద్దున తన భార్యకి సీరియస్‌గా ఉందని బ్రతిమాలి పది వేలు తీసుకుని వెళ్ళాడు. వీడి నిర్వాకం ఇదా అనుకున్నాడు.

ఇంటికి వెళ్లగానే భార్య దేవి కి విషయం చెప్పి "ఈ రోజుల్లో ఎవరినీ నమ్మే పరిస్థితులు లేవు.. ఇంకెప్పుడూ అతను వచ్చి ప్రాణం పోతుందన్నా సరే, రూపాయి కూడా ఇవ్వొద్దు" అన్నాడు. మరునాడు పొద్దున్న శీను మళ్ళీ వచ్చాడు. శ్రీకర్ కి అతని తో మాట్లాడనిపించ లేదు.. చూడ నట్లుగా తన గదిలోకి వెళ్ళిపోయాడు. శీను శ్రీకర్ భార్య తో,"అమ్మా నన్ను కోడి పం దాల కాడ చూసి సారు గారు ఏమనుకున్నారో ఏమో. నేను కోళ్ల పందెం లో డబ్బులు కాయ డం నిన్ననే మొదటి సారి". అన్నాడు.

"మళ్ళీ వీడిది ఇదో కొత్త కథ" అనుకున్నాడు శ్రీకర్..

"హాస్పిటల్ లో మా ఆవిడ ఆపరేషన్ కి పది వేలతో కుదరదు. పైన ఇంకో పాతికన్నా కావాలి తెమ్మన్నారు.. ఏమి చెయ్యాలో పాలుటపోక కూకుంటే మా ఫ్రెండ్, వెంకట రావు నన్ను కోడి పందాల కాడికి తీసుకెళ్ళి కాయించాడండీ..

మా ఆవిడ అదృష్టమేమో, మరి పందెం గెలడం, ఆ డబ్బుతో నిన్న ఆపరేషన్ పూర్తి అవడం జరిగి పోయాయండీ..

అదే మీతో ఒక పాలి చెప్పి వెళ్దామని" అన్నాడు శీను..

"ఒరేయ్. శీను.జూదం అనేది ఏదైనా ఎప్పటికీ మంచిది కాదు..జూదం లో గెలిచి ఆస్తులు కూడ బెట్టిన వాణ్ణి ఒక్కణ్ణి చూపించగలవా? అదే ఇళ్లు, వాకిళ్ళు అమ్ముకున్న వాళ్లు కో కొల్లలు. వైద్యానికి నీకు ఇంకా డబ్బు అవసరం అని నీవు అడిగితే ,తలొక చెయ్యి వెయ్యరా?

ఇప్పుడు నీ భార్యకి మంచి జరిగింది నిజమే.. మరి డబ్బులు పోగొట్టుకున్న వాళ్ళ భార్యల పరిస్థితి ఎలా ఉంటుందో ఆలో చించుకో" అని హితబోధ చేసింది దేవి.

తలొంచుకుని వెళ్ళిపోయాడు శీను.

రెండు నెలలకి మళ్లీ భార్య తో సహా వచ్చాడు. "దేవమ్మా , మీరు డబ్బు పోగొట్టుకున్న వాళ్ళ భార్య పిల్లల గురించి అన్న మాటలే గుర్తుకు వచ్చేవి.. అందుకని ఆటో నడుపుకుంటూనే రియల్ ఎస్టేట్ వాళ్ళ దగ్గర ఏజెంట్‌గా చేరి, తెలిసిన వారికి కొన్ని ప్లాట్లు అమ్మి పెట్టాను.. కమిషన్ బాగానే వచ్చింది. నిన్న చిన్న తిరుపతి వెళ్లి మొక్కు తీర్చుకుని, వచ్చిన డబ్బు మొత్తం హుండీ లో వేసి సామి దర్శనం చేసుకుని వచ్చాము.. ఇప్పుడు మనసులో భారం దిగిపోయి హాయిగా ఉన్నాది, అని ప్రసాదం దేవి చేతిలో పెట్టాడు.. "ఒరేయ్ శీను ఇదే నీ అసలైన గెలుపు"అని ప్రసాదం అందుకుంది దేవి.. తెల్లటి ప్రసాదం కవర్ మీద ఎర్రటి స్వామి వారి రేఖా చిత్రం చిద్విలాసంగా నవ్వుతూ కనిపించింది..



**- శ్రీనివాస శాస్త్రి**
హైదరాబాద్

# ఆచరణాత్మక మానవతావాది హేమలతా లవణం



జోగినీ దురాచార నిర్మూలన, నేరస్థుల సంస్కరణల కోసం అవిరళ కృషి జరిపిన మహిళా సంఘ సంస్కర్త, ప్రముఖ రచయిత్రి డాక్టర్ హేమలతా లవణం.

స్వాతంత్ర్యానంతర భారత దేశంలో సంఘ సంస్కరణ ఉద్యమానికి అవిరళకృషి చేసిన ప్రముఖ సామాజిక సేవకురాలు. సంఘం విస్మృతులైన దళితులను, గిరిజనులను సంస్కరణోద్యమ అజెండాలో చేర్చి సమకాలీన భారత చరిత్రలో ఒక ప్రధాన మైలురాయిగా మిగిలారు. సుప్రసిద్ధ కవి గుఱ్ఱం జాషువా కుమార్తెగా, సంఘసేవకుడు గోపరాజు రామచంద్రరావు (గోరా) కోడలిగా, లవణానికి జీవన సహచరిగా, అన్నింటినీ మించి సాంఘిక సంస్కర్తగా చిరపరిచితులు ఆమె.

ఆస్తికురాలిగా జీవితం ప్రారంభించి, వాస్తవికత, సంఘదృష్టి, వ్యక్తిత్వాన్ని పెంపొందించుకున్న ఆమె నాస్తికురాలిగా మారారు. ప్రశ్నించే చైతన్యం, పరీక్షించే మనస్తత్వం, సమాజంలో అణగారిన ప్రజల అభ్యున్నతికి పాటుపడాలన్న తపన, దారిద్ర్యాన్ని, అసమానతలను తొలగించి తోటి మానవులకు తోడ్పడాలన్న ఆలోచన ఆమెను క్రొత్తపుంతలు తొక్కడానికి పురికొల్పాయి. తనలో నిహితమైన శక్తి సామర్థ్యాలను, సంఘ సంస్కరణాభిలాషను, సమాజ కళ్యాణ కార్యక్రమాలను పెంపొందించేందుకు ఆమె ముందడుగు వేశారు. స్టువర్టుపురం దొంగతనాలు వృత్తిగా జీవించిన కుటుంబాలను మంచి మార్గంలో పెట్టిన మనత హేమలతదే.

హేమలతా లవణం (ఫిబ్రవరి 26, 1932 - మార్చి 20, 2008) గుంటూరు జిల్లా వినుకొండలో జాషువా మరియమ్మలకు 1932 సంవత్సరం ఫిబ్రవరి 26 న ఆఖరి సంతానంగా జన్మించారు.

ఆమె ప్రాథమిక, మాధ్యమిక విద్య గుంటూరులో సాగింది. మద్రాసు క్వీన్స్ కళాశాలలో బి.ఏ బంగారు పతక గ్రహీత. నాస్తికత్వం, ప్రజాస్వామ్య విలువలు, గాంధేయ వాదం తదితర విలువలకు కట్టుబడిన గోరా కుమారుడు లవణంతో ఆమె వివాహం జరిగింది. వర్ణభేదాలను అతిక్రమించి జరిగిన ఆమె వివాహం అప్పట్లో సంచలనం కలిగించింది. వినోబా భావే భూదాన యాత్రలో ఆయనతో పాటు చంబల్ లోయలో పర్యటించి బందిపోటు దొంగల్లో మానసిక పరివర్తన తెచ్చేందుకు కృషిచే?శారు. 1961లో వాసవ్య విద్యాలయాన్ని స్థాపించి సమత, మమతల కోసం పాటు పడ్డారు. శ్రీకాకుళం, కృష్ణా జిల్లాల్లో ఆర్థిక సమతా మండలి అని సేవా సంస్థను స్థాపించి వెనుక బడిన వారిలో, నిమ్న కులాల్లో చైతన్యం కోసం పలు కార్యక్రమాలు చేపట్టారు. 1981లో కావలిలో 'నవవికాస్' అనే సంస్థను స్థాపించి దాని ద్వారా అణగారిన వర్గాలను ఆదుకొన్నారు. జోగినులను, వారి పిల్లలను ఆదుకోవడానికి 'సంస్కార్' చెల్లి నిలయం అనే సంస్థలు ఏర్పరచారు. అంధ విశ్వాసాలు 'బాణామతి' మహిళల జీవితాలను ధ్వంసం చేస్తోన్న వైనాన్ని గుర్తించి వాటిని ఆరోగ్య సమస్యగా గుర్తింప చేయడానికి కృషి చేశారు.

రెండు వేలకు పైగా జోగినులను సంస్కరిం చడమే కాక ప్రభుత్వం చేత వారికి పొలాలు ఇప్పిం చి, జోగినులకు వివాహాలు జరిపించారు. సంస్కార్ సంస్థను స్థాపించి, నిజామాబాదు జిల్లాలో జోగినీ వ్యవస్థ నిర్మూలణకు ఆమె చేసిన కృషి ఫలితంగా "ఎన్టీ రామారావు ప్రభుత్వం జోగినీ వ్యవస్థ నిర్మూలణ చట్టాన్ని" తెచ్చింది. వర్ణాం తర, మతాంతర వివాహాలను ప్రోత్సహించారు. బాలికల కోసం నిజామాబాద్ జిల్లా, గాంధారి గ్రామంలో ప్రత్యేక పాఠశాల నిర్మించారు. చైల్డ్ ఎట్ రిస్క్ (సి.ఎ.ఆర్) పేరుతో దొంగలు, తాగుబోతులు, వ్యభిచార వృత్తిలో కూరుకు పోయిన వారి పిల్లల కోసం సంస్కరణ కేంద్రం స్థాపించారు.

"గోరా కోడలు కావడం తన జీవితంలో జరిగిన గొప్ప విషయం" అనేవారు హేమలత. అప్పటి వరకు ఇంటి బాధ్యతలు చదువుకి మాత్రమే పరిమితమైన ఆమె బయటి ప్రపంచాన్ని చూసింది లవణంతో కలిసి చేసిన యాత్ర ల్లోనే. అయితే, అతి తక్కువ కాలంలోనే సంఘ సేవికగా మారి పోగలగడం వెనుక ఆమెలో ఉన్న దయాగుణం, స్పందించే హృదయం కారణాలు అంటారు.


జాషువా కావ్యాలు అందరికీ అందుబా టులో ఉండాలన్న దృఢసంకల్పంతో వాటన్నిట్నీ ముద్రించారు. స్వయంగా పలు ప్రక్రియల్లో రచనలు చేశారు. అహింసా మూర్తులు - అమర గాథలు, నేరస్థుల సంస్కరణం, జీవన ప్రభాతం, జాషువా కలం చెప్పిన కథ, మా నాన్న గారు, జీవన సాగరం, అనుభవ తరంగాలు, నేరస్తుల సంస్కరణ, తాయెత్తు - గమ్మత్తు, మృత్యోర్మా అమృతంగమయ వంటి పలు రచనలు చేసిన ఆమె 'జీవన ప్రభాతం' నవలకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం పొందారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఆత్మగౌరవ పురస్కారం, కర్ణాటక ప్రభుత్వం నుంచి దేశస్నేహి పురస్కారం, అమెరికా నుంచి ఎథీయిస్ట్ ఎచీవ్‌మెంట్ అవార్డు, 2003 సంవత్సరానికి రెడ్ అండ్ వైట్ బ్రేవరి అవార్డు, సావిత్రి పూలే అవార్డు వంటివి ఎన్నో పొం దారు. ఆంధ్ర, నాగార్జున విశ్వ విద్యాలయాల సిండికేట్ మెంబరుగా పనిచేశారు. స్టూవర్టుపు రం దొంగల పునరావాసం - సంస్కరణ దురాచారంపై హేమలతా లవణం విశేషంగా కృషి చేశారు. 1977 దివిసీమ ఉప్పెనలో బాధితులకు పునరావాస సేవలందించారు. 1979లో ప్రకాశం, నెల్లూరు, 1996 తూర్పుగోదావరి జిల్లా తుపాను విపత్తు సమయంలో సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆమె సంఘ సేవికగా చేసిన కృషికి, రచనలకు తెలుగు విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్, తానా ఎచ్చీవ్‌మెంట్, వరల్డ్ ఎచ్చీవ్‌మెంట్ అవార్డులు అందు కున్నారు. మాజీ ముఖ్య మంత్రులు ఎన్టీఆర్, చంద్రబాబు నుంచి తెలుగు ఆత్మగౌరవ అవార్డు లు తీసుకున్నారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి నుంచి ఉగాది పురస్కారాన్ని, అంబేద్కర్ శతజయంతి సందర్భంగా భీమరత్న అవార్డును పొందిన ఏకైక మహిళ హేమలత. గుఱ్ఱం జాషువా ఫౌండేషన్ స్థాపించి దేశంలో తొమ్మిది మంది కవులకు పురస్కారాలు అంద చేశారు. అండాశయపు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ విజయవాడ లోని నాస్తిక కేంద్రంలో మార్చి 20, 2008 న శాశ్వత నిద్రలోకి జారుకున్నారు హేమలతా లవణం.

(ఫిబ్రవరి 26... హేమలతా లవణం జయంతి)



**-రామ కిష్టయ్య సంగన భట్ల,**
9440595494

## భుజం చెట్టుపై చిలుక



భూమి
కలవరానికి గురైనప్పుడల్లా
జలవరాన్ని కోరుతుంది
నీ జాగను నేను గుంజుకుంటే
నాదైపోతదా?
పెయ్యి మీద పుట్టుమచ్చల్ని
తీసుకుంట పోయినా
యాడనో కనపడని జాగల కెళ్ళి
నిన్ను ఎక్కిరిస్తనే ఉంటది
మెడ మీద పెట్టిన కత్తిని
తీసెయ్యంగనే
చిలుక కూర్చుంది
ఎంత తండ్లాడినా
ఆలోచన తెగడం లేదు
శూన్యాన్ని నింపనీకి
ఎక్కడో ఒక తడి ఉండనే ఉంటది
భూమి పండాలంటే తడి కావాల్సిందే
చిలుక చనిపోయిందా?
ఒక జ్ఞాపకంగ
భుజంపై నిలిచిపోయింది
ఎంతెత్తుకెగిరేది
ఎన్నెన్ని గింజల్ని తెచ్చేది
తిన్నదెంతో తెలీదు కాని
పంచింది మాత్రం
అనంతమైన ఆత్మస్థైర్యాన్ని
కొమ్మ కొమ్మ పై ఎగిరేది
మనసు గుమ్మాలన్నీ
కలియ తిరిగేది
అడవిలో ఉండేది కదా!
అనంతంగా నడవడం
ఎప్పుడూ కష్టాల్లో తడవడం-
వనమంటే చిగురించిన జనమేగా!
భుజాలన్నీ గీరుకు పోయ్యేదాక
తనను తాను
తత్వంలా తవ్వుకునేది
పైపైకి ఎగిరేది
అడవిలోని చెట్ల ఆకులన్నీ
తేరిపార చూసేది
ఏ వేటగాడినైనా
డేగలా పసిగట్టేది
ధైర్యాన్ని జెండాగా నిలుపుకొని
ఆకాశంలోకి ఎగిరేది
ఎంతెత్తుకో ఎగిరి ఎగిరి
తను తిరిగిన తొవ్వనంతా
కడిగి రంగులద్దేది
తన ఆలోచనే
జనానికి
ధైర్యమయ్యేంతగా ఎగిరింది-
హక్కుల కోసం
కత్తి అంచుపై కంటి రెప్పల పహారా
ఉంది
అక్కడా ఇక్కడా అంటూ
మధ్యన నలిగిపోయే
పావురాలూ ఉన్నాయి
రాజ్యం చల్లిన గింజలకు
లొంగిపోయిన పక్షుల గుంపు
తనతో నమ్మకంగా ఉంటూనే
బలిచ్చేసింది-
తను పొదుముకున్న
జనతనాన్ని కబలించేసింది
ధైర్యాన్ని నింపిన జీవితాలు
దైన్యంగా చూసేలా మారిపోయింది
ఎప్పుడూ
తను నడిచిన దారంతా
వనాల్ని నింపుదామనుకుంది
పచ్చని ఆకుల సమూహంలో
ఎర్రని పూలలాగా ఉండాలనుకొంది
దేశం అంటే మన్నే
దాటి చరించావంటే నీ జీవితమూ
మన్నే-
చిలుక
చెట్టు పైన ఉండడమే సహజత్వం
పంజరాన్ని ప్రేమించిందా
జ్ఞాపకం గానే మిగులుతుంది
చిలుక
చిలుకగా ఉండడమే అవసరం
ఎప్పుడైతే భుజంపై వాలుతుందో
తన సహజత్వాన్ని
చంపేసుకుంటుంది
చిలుక
గాల్లో తిరుగుతూ
ప్రపంచాన్ని పహారా కాస్తుంది
శూన్యంలోంచి
భూమిపైకి వస్తున్న తార
మధ్యలోనే
మరణం అంచుకు చేరుకుంటుంది
అడివంతా కాచిన వెన్నెల
చీకటి గాయమవుతుంది
జలజలా సవ్వడి చేసిన సెలయేళ్లు
సర్రున భూమిలోకి
జారుకుంటున్నాయి
ఎండ కన్నెర్రలో కాగిపోతున్నాయి
చెట్టును అడివి కాచింది-
రెప్పపాటుపై కత్తి
నిరంతరం
వేలాడుతూ ఉంది

**-జి.నరసింహస్వామి**
*9441041475*

## గుడుగుంజం

లడ్డు లెన్నో విసిరేస్తాం
అడ్డు ఎక్కడ మా దారికి
వందలనుండి లక్షల దాకా
ఎందరికైన పంచేస్తాం.

శ్రీ లు పంచే వ్యాపారం
శ్రేయస్సు లే కోరుతుంటాం
శ్రేయోభిలాషులం మేము
అక్షయ మీ యడమే మా లక్ష్యం.

సవాలక్ష రంగాలున్నాయి
మహా మహా పేర్లున్నాయి
సరసమైన ధరలున్నాయి
సకల కీర్తి ప్రభలున్నాయి.

చక్కర పాకం సన్మానాలు
చక్కగా ఏర్పాటుచేస్తాం
కోరిన ప్రముఖుల పేర
పురస్కారాలందిస్తాం.

అక్షరం రాకున్నాసరే
అడిగితే డాక్టరేట్లిస్తాం
మీడియా..ఏ.. ఐ..ప్రచారాలకు
మేమే బాధ్యత వహిస్తాం.

ఎందరో అష్టావక్రలు
అన్నిట్లో జీనిణబీబబిజీ మాత్రులు
అయినా గుడి గూడు గుంజెం
గండపెండే రాలు అందిస్తాం.

అసలేమీ తెలియని వాడే
సిసలైన మేధావి కాదా
ఆశల..ఆవలింతల దేశంలో
అర్హత లెప్పుడు గెలిచాయి.

ఏది..ఎక్కడ..ఎప్పుడైనా..
ఏలిన్నవారి తొత్తులకే....

మేధావులు కునుకు తీస్తుంటే..
ప్రభలు వెర్రి కుక్కలకే.

కోర్కెలు పెరిగే కొద్దీ
మార్కెట్లోకెన్నో వస్తాయి..
ఆశలగిలిగింతల లోనే
అన్ని అంగడి సరుకులవుతాయి.

బిచ్చగాళ్లలా వరుస క్రమంలో
చిప్పలు పట్టుకు నిల్చోండి
శరణా గతిలో దీనంగా
శరణాగతిలో రారండి.

మా..వెబ్సైట్ వాడుకోండి
మీ ఖదూతి తీర్చుకోండి
ఆన్లైన్లో అర్థరిస్తే..
హై..వే..లెవల్లో
సమకూరుస్తాం....

**-చకోనా**
9885797375



సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

## 'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు

అడ్మిన్:**రమాదేవి కులకర్ణి**
8985613123

నిర్వహణ: **శ్రీమతి సత్య నీలిమ**



## అక్షర శిఖరం -ఆత్మవిశ్వాసగీతం

కారుచీకటిని చీల్చుకుంటూ వచ్చే ఉషోదయంలా..
నీ మస్తిష్కపు పొరల్లో నిదురిస్తున్న జ్ఞానాన్ని తట్టిలేపు!
పరీక్ష అంటే పంజరం కాదు, నీ రెక్కల బలాన్ని పరీక్షించే అనంత ఆకాశం.
ఒత్తిడి అంటే భారమే కాదు,
నీలోని వజ్రాన్ని మెరిపించే నిశిత ఘర్షణ.
పుటల వెనుక దాగిన అక్షరాలు..
నీ విజయానికి వేచి ఉన్న సైనికులు,
నీ కలం నుండి జాలువారే సిరా.. నీ చరిత్రను లిఖించే జీవనది!
ప్రశ్నపత్రం నీ ముందు నిలిచిన ఒక కవచం మాత్రమే,
నీ మేధస్సు అనే వాడియైన శరం దాన్ని ఛేదించి తీరుతుంది.
ఓటమి అనే నీడను చూసి వెనకడుగు వేయకు,
మార్కులనే మాయలో పడి నీ మౌలికతను కోల్పోకు.
శిల ఎంతగా చెక్కబడితేనే కదా శిల్పమయ్యేది?
నీ శ్రమ ఎంతగా ఒత్తిడికి లోనైతేనే కదా..
నీలోని ప్రతిభ లోకానికి తెలిసేది!
గుండెల్లో నిబ్బరాన్ని నింపుకో..
కనుపాపల్లో లక్ష్యాన్ని నిలుపుకో..
నీ సంకల్పం ముందు ఏ పర్వతమైనా తలవంచక తప్పదు,
నీ అక్షర సేద్యంలో విజయ కేతనం ఎగరక మానదు!.

**-టి.మహేష్ గౌడ్**
నాగర్ కర్నూల్

## నిర్ణీత ప్రణాళిక

జీవితంలో ఎదగాలంటే
పరీక్షలు ఎదుర్కోవడం
ఎంత అవసరమో
ఒత్తిడిని తట్టుకోవడం
అంతే ముఖ్యం
పైకి ఎదగాలంటే
ఒదిగుండాలి
సమయపాలనతో...
నిర్ణిత ప్రణాళిక
నియమ నిబద్ధత
ఓపిక ప్రశాంతతతో
ఉన్నప్పుడే విజయం!!.
మనకుండే వ్యాపకాలకు
దూరంగా ఉంటూ
అవసరమైన విషయాలను
మననం చేసుకుంటూ
సులభ పద్ధతుల ద్వారా
కఠినమైన దాన్నైనా...
సాధించవచ్చును
కంగారును వీడి
అతిగాలోచించకుండా
పట్టుదలను విడువక
విశ్వాసంతో ముందుకెళ్ళాలి!!.
నమ్మకపు పునాదిపైన
శ్రమిస్తూ లక్ష్యం దిశలో
ఒక్కొక్క మెట్టెక్కినట్లు
ఒకదాని తర్వాత ఒకటి
చదువుతూ వుంటే
తెలియని ఉత్సాహంతో
పరీక్షల ఒత్తిడికి దూరమై
అత్యుత్తమ ఫలితాల...
ఫలాలను అందుకోగలం!!.

-మద్దెల సరోజన

## ఇది ఒక విషమ పరీక్షా సమయం

ప్రతి యేడాది మార్చి ఏప్రిల్ మాసాలలో
విద్యార్థులకు పరీక్షా సమయం
పది ఇంటర్ డిగ్రీ పరీక్షల హడావుడి
దిశను భవిష్యత్తును నిర్దేశించే కాలం
ర్యాంకులు గ్రేడులంటూ కార్పోరేట్ సంస్థల
ఆరాటం పోరాటం విద్యార్థులపై వత్తిడి!.
ఇది ప్రజలకు విషమ పరీక్షా సమయం
విద్యార్థుల పరీక్షలతో తల్లిదండ్రులలో అలజడి
సాఫ్ట్వేర్ ఉద్యోగాలు ఊడి మరి కొందరు సతమతం!.
ఇది భారత దేశానికి పరీక్షా సమయం
ట్రంప్ రాకతో ప్రపంచ దేశాలు వణికి పోతుండే
భారత దేశానికి ఇది పెద్ద అగ్ని పరీక్ష!.
ఇన్వెస్టర్లకు పరీక్షా సమయం
షేర్ మార్కెట్ కుప్పకూలే బంగారం వెండి ధరలు ఆకాశంలో!.
ఇది ప్రకృతికి పరిక్షా సమయం
షష్ట గ్రహ కూటమి కావడం గ్రహాలు ఏర్పడటం
సముద్రాలలో ఆటుపోటులు కరువు కాటకాలు
జరుగుతాయని జ్యోతిష్య శాస్త్రం హెచ్చరిక!
పరీక్షలు వస్తుంటాయి పోతుంటాయి
సంయమనం పాటిస్తే అన్నీ సర్దుకుపోతాయి!.

**-మార్గం కృష్ణ మూర్తి** , హైదరాబాద్

## విజయం

ర్యాంకుల వెంట రాంకె లేస్తూ,
మార్కుల సాధనే ధ్యేయంగా
బట్టీతో కుస్తీ పడుతూ, సృజనాత్మకతకు తావీయక,
అంతర్గతంగా తమలోని శక్తికి పదును పెట్టక,
తమలోని ప్రజ్ఞా పాటవానికి విషమ పరీక్ష అనుకుంటే పొరపాటే
ఇష్టంగా కష్టపడి చదివితే విజయం మీ వెంటే...
ర్యాంకులు రావా మొన్ననే తంటాలు సమయపాలనను పాటించక,
వాయిదా పద్ధతిని వీడి,
మానేసిక ఒత్తిడికి గురవక,
ఆరోగ్యమైన వాతావరణంలో చదవాలి...
క్రమశిక్షణను అలవర్చుకొని, ఎప్పటివప్పుడు
ఎప్పటికప్పుడు చదివితే ఉత్తీర్ణత మీదే...
ఒత్తిడి జయించే ఔషధమే సమయపాలన,
నిబద్ధతకు నిర్వచనమై చదివితే గెలుపు బావుటా మీదే...
ఆటపాటలతో మానసికల్లాసాన్ని పొందే ప్రశాంతతతో చదివి
ఏకాగ్రతతో అర్థం చేసుకుని చదివితే
ఏకలవ్య శిష్యులే అందరూ...

**-కొంజేటి రాధిక**
రాయదుర్గం

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com